# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 171 | హైదరాబాద్ | శుక్రవారం 26-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

పర్వతంపై విషాదం..
హెలికాప్టర్ కూలి ఐదుగురి మృతి



## విష్ణుమూర్తి విగ్రహం కూల్చివేత..
### రెండు దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తత

- ఇది థాయిలాండ్ పనేనంటూ కంబోడియా ఆరోపణ
- కూల్చివేస్తున్న వీడియో మీడియాలో వైరల్

11లో

## భారీ బొగ్గు నిక్షేపాలు..
### 60 ఏళ్లకు సరి పడా విద్యుత్ ఉత్పత్తికి అవకాశం..!

- దేశ బొగ్గు ఉత్పత్తి చిత్రపటంలోకి చేరనున్న ఏపీ
- ఏలూరు జిల్లా రేచర్ల బ్లాక్‌లో త్వరలో బొగ్గు తవ్వకాలు
- బిడ్లు దాఖలు చేసిన రిలయన్స్, యాక్సిస్ ఎనర్జీ సంస్థలు
- 60 ఏళ్ల పాటు 8,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం

11లో





11లో

## పట్టుబడితే.. బండి సీజ్

- న్యూ ఇయర్ సందర్భంగా మందుబాబులకు హెచ్చరిక
- పార్టీలకు వెళ్లే వాళ్లు డ్రైవర్లను వెంట తీసుకురావాలని సూచన
- సామాన్యులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించవద్దని హెచ్చరిక

## న్యూ ఇయర్ వేడుకలు

- నగరంలో డిసెంబర్ 31 వరకు తనిఖీలు
- హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు
- గురువారం 304 మంది వాహనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిక

11లో

2026

## టీటీడీ గుడ్ న్యూస్..

- వైకుంఠ దర్శనంపై కీలక ప్రకటన
- వైకుంఠ ద్వార దర్శనానికి ప్రత్యేక కోటా
- తిరుమల, తిరుపతి వాసులకు రోజుకు 5,000 టోకెన్లు

11లో





11లో

## భారీ ఎన్‌కౌంటర్..
### ఐదుగురు మావోల మృతి

- మృతుల్లో ఒక మహిళా మావోయిస్టు
- ఘటనా స్థలం నుంచి మావోల ఆయుధాలు స్వాధీనం

## సీఎంతో విజయవాడ ఎంపీ భేటీ
### ఆ కీలక అంశంపై వినతి

- గ్రేటర్ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుపై సీఎంకు ఎంపీ వినతి
- సానుకూలంగా స్పందించిన సీఎం
- త్వరలో సానుకూల నిర్ణయం తీసుకునే అవకాశం

11లో



# పవన్ మార్క్ పాలిట్రిక్స్...

కాకినాడ, డిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

జనసేనఅధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల మళ్లీ రాజకీయంగా పెద్ద శబ్దమే చేస్తున్నారు. గోదావరి జిల్లాల ప్రాంతంలో నిర్వహించిన సభలో ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నిడదవోలు నియోజకవర్గంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడిన మాటలు ఏపీ రాజకీయ వర్గాల్లో ఒక్కసారిగా చర్చకు దారితీశాయి. ప్రత్యర్థులపై తీవ్రమైన పదజాలంతో మాట్లాడిన పవన్, తన ఆవేశాన్ని వేదిక మీదే స్పష్టంగా చూపించారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో, అధికారుల సమక్షంలోనూ ఆయన ఘాటైన భాషను ఉపయోగించడం చాలామందిని ఆశ్చర్యానికి గురిచేసింది. అక్కడితో ఆగకుండా మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మరోసారి ఆయన అదే తీరులో స్పందించారు. వైసీపీకి భవిష్యత్తులో అధికారం దక్కకుండా చేస్తామని, ఆ పార్టీని రాజకీయ పార్టీగా కూడా గుర్తించబోమని ప్రకటించారు. తప్పులు చేసిన వారిపై చర్యలు తప్పవని, చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదని కూడా ఆయన స్పష్టం చేశారు. అయితే ఈ వ్యాఖ్యలు ప్రజల్లోకి వెళ్లిన విధానం వేరుగా ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఎందుకంటే పవన్ ప్రస్తుతం అధికారంలో ఉన్న కీలక నాయకుడు. ప్రజలు ఇచ్చిన అధికారంతో చట్ట ప్రకారం చర్యలు తీసుకునే స్థితిలో ఉన్నారని, అలా ఉండి కూడా హెచ్చరికల స్థాయిలో మాట్లాడటం ఎందుకన్న ప్రశ్నలు మొదలయ్యాయి. సాధారణంగా విపక్షంలో ఉన్న పార్టీలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాయి, విమర్శలు చేస్తాయి. అది రాజకీయంగా సహజమే. ప్రస్తుతం ఆ స్థానంలో వైసీపీ ఉంది. వారు ప్రభుత్వం తప్పు చేసినా చేయకపోయినా ప్రశ్నలు లేవనెత్తుతారు. అప్పుడు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అవుతుంది. ప్రజల దృష్టి ఎప్పుడూ పాలకులపైనే ఉంటుందన్న విషయం నాయకులు గుర్తుంచుకోవాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారంలో ఉన్నవారు ఆవేశం చూపిస్తే, అదే ప్రజల్లో చర్చగా మారుతుంది. సమస్యలకు పరిష్కారాలు చూపాల్సిన బాధ్యత పాలకులపై ఉంటుందని పలువురు చెబుతున్నారు. అయితే పవన్ ఈ రీతిలో మాట్లాడటానికి వెనుక వ్యూహం ఉందని కొందరు విశ్లేషకులు అంటున్నారు. గత కొంతకాలంగా పార్టీ క్యాడర్‌పై ఆయన దృష్టి తక్కువగా ఉందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం వారిని ఉత్సాహపరిచేందుకు ఈ తరహా మాటలు ఉపయోగిస్తున్నారని అంచనా వేస్తున్నారు. క్యాడర్‌కు సందేశం ఇవ్వాలంటే పార్టీ సమావేశాల్లో మాట్లాడటం సరైనదని, ప్రభుత్వ కార్యక్రమాల్లో మాత్రం భాష హుందాగా ఉండాలని అభిప్రాయం వినిపిస్తోంది. ఇదే సమయంలో గతాన్ని గుర్తు చేసే వారు కూడా ఉన్నారు. 2019 ఎన్నికల సమయంలో అధికారంలోకి రానివ్వనని చెప్పినా పరిస్థితి భిన్నంగా మారిందని వారు గుర్తు చేస్తున్నారు. అందుకే రాజకీయంగా శపథాలు, సవాళ్లకన్నా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే పనులు చేయడం నాయకులకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. పవన్ నుంచి ప్రజలు కూడా అదే ఆశిస్తున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.



పవన్ మార్క్

పరిపాలనలో ఫలితాలు సాధించడమే కాకుండా, రాజకీయ వ్యూహాలలోనూ పవన్ కళ్యాణ్ తనదైన శైలిని చూపించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడడంలో ఆయన పాత్ర అత్యంత కీలకమైంది. ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ , భారతీయ జనతా పార్టీ ( మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి, మూడు పార్టీల కలయిక అవసరమని ముందుగానే స్పష్టంగా చెప్పారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనకు ముగింపు పలకాలంటే ఐక్యతే మార్గమని ఆయన రాజకీయంగా ధైర్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. చంద్రబాబు నాయుడు గారి అరెస్టు సమయంలో బహిరంగంగా సంఘీభావం ప్రకటించి, రాజకీయంగా స్పష్టమైన వైఖరిని వెల్లడించడం అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. అదే సమయంలో బీజేపీని కూటమిలోకి తీసుకురావడంలో, టీడీపీని ఎన్డీఏలో భాగం చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. ఫలితంగా రాష్ట్రంలో కూటమి విజయం సాధించగా, జాతీయస్థాయిలో నరేంద్ర మోదీ గారి మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టడంలో కూడా ఆంధ్రప్రదేశ్ పాత్ర ఉందనే అభిప్రాయం బలపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పవన్ కళ్యాణ్ కు డిప్యూటీ సీఎం హోదాతో పాటు కీలక శాఖలు దక్కాయి. గ్రామీణ నేపథ్యం ఉన్న శాఖలే తనకు కావాలన్న ఆయన కోరిక మేరకు పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖల బాధ్యతలు ఆయనకు అప్పగించారు. ఈ శాఖలలో ఆయనకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు రాష్ట్ర నిధులను సమర్థంగా వినియోగిస్తూ, గ్రామాల అభివృద్ధికి స్పష్టమైన దిశను నిర్ణయించారు. "పల్లె పండుగ" వంటి కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, పచ్చదనం వంటి మౌలిక వసతులు మెరుగుపడ్డాయి. గత రెండు సంవత్సరాలుగా జరిగిన ఈ అభివృద్ధి పనుల ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ జాతీయ స్థాయిలో నెంబర్ వన్ గా నిలిచింది. ఈ విజయం పూర్తిగా పవన్ కళ్యాణ్ గారి పనితనం, నిర్ణయశక్తి, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత వల్లే సాధ్యమైందని చెప్పవచ్చు. రాజకీయాల్లో మాటలకే పరిమితం కాకుండా, పనితో ఫలితాలు చూపిస్తున్న నాయకుడిగా పవన్ కళ్యాణ్ ఇప్పుడు రాష్ట్రానికే కాదు, దేశానికీ గుర్తింపుగా మారుతున్నారు.

========================

# ఇస్రో విజయ పరంపర

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. మొదటిసారి అతి భారీ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టి ఇస్రో నిన్న తన సత్తా చాటుకుంది. ఎల్‌వీఎం-3 ఎం-6 రాకెట్ సాయంతో అమెరికాకు చెందిన 6,100 కిలోల బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహాన్ని శ్రీహరికోట నుంచి దిగ్విజయంగా నింగిలోకి పంపింది. ఎల్‌వీఎం-3కి ఇది వరసగా తొమ్మిదో విజయం. పైగా, 52 రోజుల వ్యవధిలోనే రెండు ప్రయోగాలను అనుకున్నట్లుగా పూర్తిచేయడం ఇస్రో సమర్థతకు తార్కాణం. ఇదే ఉత్సాహంతో వచ్చే మార్చి నాటికి మరిన్ని ప్రయోగాలకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సిద్ధమవుతోంది. 'గగన్‌యాన్'లో భాగంగా ఒక రోబోను ఆకాశంలోకి తీసుకెళ్లనుంది. ప్రైవేటు రాకెట్‌నూ ప్రయోగించనుంది. అతిపెద్ద శాటిలైట్లను రోదసిలోకి తరలించాలంటే స్పేస్‌ఎక్స్, ఐరోపా స్పేస్ ఏజెన్సీ లాంటివే గుర్తొచ్చే పరిస్థితుల్లో ఇస్రో సాధించిన తాజా ఘనత అంతరిక్ష విపణిలో ఇండియా స్థానాన్ని పటిష్ఠపరుస్తుంది. ఇస్రోపై ప్రపంచదేశాల్లో నమ్మకాన్ని ఇనుమడింపజేసి రాబోయే రోజుల్లో వాణిజ్య ప్రయోగాలకు మరింత ఊతమిస్తుంది. తద్వారా దేశీయ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ మరిన్ని కొత్త పుంతలు తొక్కే వీలుంది.

అయిదు దశాబ్దాల కిందట సొంత శాటిలైట్ సాంకేతికత లేని ఇండియా- దార్శనిక శాస్త్రవేత్తల కృషితో అంతరిక్ష రంగంలో వడివడిగా అడుగులు వేసింది. అనతికాలంలోనే 104 ప్రయోగాలు చేపట్టింది. వచ్చే పదిహేనేళ్లలో వాటి సంఖ్యను అంతకు రెట్టింపు స్థాయికి చేర్చాలని నిశ్చయించింది. మంగళయాన్, చంద్రయాన్-3 వంటి వాటి ద్వారా తన శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి వెల్లడించిన ఇస్రో- 2040 కల్లా చంద్రుడిపై భారత వ్యోమగామి పాదంమోపేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అంతకు అయిదేళ్ల ముందే సొంత స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్న ఇండియా స్వప్నాన్ని సాకారం చేసేందుకు శ్రమిస్తోంది. రెండేళ్లలో మానవసహిత అంతరిక్ష యాత్రను చేపట్టేందుకు ఉద్యుక్తమవుతోంది. ఇస్రో విజయ పరంపరను గమనిస్తున్న చాలా దేశాలు వాటి ఉపగ్రహ ప్రయోగాలకు ఇండియానే ఆశ్రయిస్తున్నాయి. ఈ క్రమంలో ఇంతవరకు 34 దేశాలకు చెందిన 434 ఉపగ్రహాలను ఇస్రో అంతరిక్షానికి చేర్చింది. తద్వారా దేశానికి నాలుగు వేల కోట్ల రూపాయలకు పైగా ఆర్జించి పెట్టింది. ఇస్రో వెచ్చిస్తున్న ప్రతి రూపాయికి రెండున్నర రెట్ల ప్రతిఫలం వస్తుండటం ఆ సంస్థ అద్భుత పనితీరుకు నిదర్శనం!ఇతర దేశాలతో పోలిస్తే చాలా చౌకగా నాణ్యమైన సేవలు అందిస్తున్నా- ప్రస్తుతం అంతర్జాతీయ అంతరిక్ష విపణిలో ఇండియా వాటా రెండు శాతమే. రాబోయే పదేళ్లలో దాన్ని 10శాతానికి పెంచాలని కేంద్రం సంకల్పించింది. ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో మన రోదసి కార్యకలాపాల్లో పురోగతి వేగవంతమైంది. నేడు ఇండియా అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ విలువ 840 కోట్ల డాలర్లు. వచ్చే దశాబ్ద కాలంలో అది అంతకు అయిదున్నర రెట్లకు పెరిగే అవకాశముంది. అందులో అధిక వాటా దేశీయ స్టార్టప్‌ల నుంచే ఉంటుందన్నది నిపుణుల అంచనా. ఉపగ్రహాల తయారీ, లాంచింగ్ సేవలు, అంతరిక్ష ఆధారిత సమాచార విశ్లేషణ తదితరాల్లో ఇండియాలో ఇప్పుడు నాలుగు వందల దాకా స్టార్టప్‌లు పనిచేస్తున్నాయి. వ్యవసాయం నుంచి జాతీయ భద్రత వరకు, సమాచార ప్రసారాలు మొదలు విపత్తు నిర్వహణ దాకా ఉపగ్రహాలు కీలక సేవలందిస్తున్నాయి. సంబంధిత ప్రయోగాలు ఇకపై ఇంకా జోరందుకోనున్నాయి. ఈ నేపథ్యంలో అంతరిక్ష కార్యక్రమ అవసరాలకు తగినంత నిపుణ మానవ వనరులను భారత్ తయారు చేసుకోవాలి. పాఠశాల స్థాయి నుంచే పిల్లల్లో వైజ్ఞానిక స్పృహ పెంచాలి. ఆర్‌అండ్‌డీకి ఇతోధికంగా నిధులు కేటాయిస్తూ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా సంస్కృతిని పెంపొందించాలి.

# పాతపట్నం వైసీపీలో రగడ..రగడ

శ్రీకాకుళం,డిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

ఉత్తరాంధ్రాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కొన్ని నియోజకవర్గాలు కంచుకోటలుగా పేరున్నాయి. కానీ 2024 ఎన్నికలు ఆ అంచనాలను పూర్తిగా తలకిందులు చేశాయి.



మొత్తం 34 అసెంబ్లీ స్థానాలు ఉన్న ఉత్తరాంధ్రలో వైసీపీకి కేవలం రెండు సీట్లు మాత్రమే దక్కాయి. అవి కూడా ఏజెన్సీ ప్రాంతాలకు పరిమితమయ్యాయి. దీంతో మైదాన ప్రాంతాల్లో, ముఖ్యంగా కీలక జిల్లాల్లో ఆ పార్టీ ఉనికి దాదాపుగా కనుమరుగైంది. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని పాతపట్నం నియోజకవర్గం పరిస్థితి ఇప్పుడు ప్రత్యేక చర్చకు వచ్చింది. పాతపట్నం వైసీపీకి ఒకప్పుడు బలమైన సీటుగా ఉండేది. 2014, 2019 ఎన్నికల్లో అక్కడ వరుసగా పార్టీ విజయం సాధించింది. 2024లో ఓటమి ఎదురైనా ఓట్ల శాతం మాత్రం గణనీయంగా వచ్చింది. దానికి ప్రధాన కారణంగా దివంగత మాజీ ఎంపీ పాలవలస రాజశేఖరం కుటుంబానికి ఉన్న బలమైన పట్టు అని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఎన్నికల తర్వాత ఈ నియోజకవర్గంలో వైసీపీ పరిస్థితి ఎలా ఉంది అన్నది ఆసక్తికరంగా మారింది. వైసీపీలో అంతర్గత వర్గపోరు పాతపట్నంలో పెద్ద సమస్యగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్ని వర్గాలను కలుపుకుని వెళ్లలేకపోయారని, 2019 నుంచి 2024 మధ్య కాలంలో పలుమార్లు ఈ విషయాన్ని పార్టీ అధినాయకత్వానికి తెలియజేశారని అంటున్నారు. అయినా సమస్య పరిష్కారం కాలేదని, చివరకు అదే ఎన్నికల ఫలితంపై ప్రభావం చూపిందని విశ్లేషిస్తున్నారు. హీరమండలం నుంచి ఆమె కుమారుడు జెడ్పీటీసీగా పోటీ చేసినప్పుడు కూడా వర్గపోరే ఓటమికి కారణమైందన్న అభిప్రాయం ఉంది. ఈ పరిణామాలతో నియోజకవర్గ రాజకీయ సమీకరణలు పూర్తిగా మారిపోయాయి. అదే సమయంలో 2024లో తెలుగుదేశం పార్టీ అక్కడ భారీ విజయం సాధించింది. దాదాపు పదిహేనేళ్ల తర్వాత వచ్చిన ఈ గెలుపు ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. కూటమి పార్టీలన్నీ ఐక్యంగా పనిచేయడం, కొత్త అభ్యర్థిగా స్థానికంగా ప్రభావం ఉన్న మామిడి గోవిందరావును ముందుకు తీసుకురావడం కలిసి వచ్చాయి. గతంలో టీడీపీకి కీలకంగా ఉన్న కలమట కుటుంబాన్ని పక్కన పెట్టినా ఫలితం మాత్రం అనుకూలంగా మారింది. ప్రస్తుతం గోవిందరావు ఎమ్మెల్యేగా తన పట్టును బలపరుచుకుంటూ ప్రజల్లో చురుగ్గా తిరుగుతున్నారుఇక ఆయన ప్రారంభించిన ఆపరేషన్ ఆకర్ష్ రాజకీయంగా వైసీపీకి పెద్ద దెబ్బగా మారింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజు సమయంలో పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజాప్రతినిధులు టీడీపీలో చేరడం సంచలనం సృష్టించింది. మరోవైపు జనసేన పార్టీ కూడా ఈ సీటుపై ఆశలు వదులుకోవడం లేదు. వచ్చే ఎన్నికల్లో పాతపట్నాన్ని కోరాలని చూస్తూ ఒక మహిళా నాయకురాలు గట్టిగా కదులుతున్నారు. ఆమె భర్తకు నామినేటెడ్ పదవి రావడంతో, ఆయన ప్రభావంతో కొంతమంది వైసీపీ నేతలు జనసేన వైపు మొగ్గు చూపుతున్నారని ప్రచారం సాగుతోందిఈ రెండు వైపుల నుంచి ఎదురవుతున్న ఒత్తిడితో వైసీపీ ఎలా నిలబడుతుందన్నది ప్రశ్నగా మారింది. ఈ నేపథ్యంలో పార్టీ అధినాయకత్వం రెడ్డి శాంతిని పిలిపించి నియోజకవర్గాన్ని బలోపేతం చేయాలని సూచించినట్టు సమాచారం. పరిస్థితులను జాగ్రత్తగా గమనిస్తున్న హైకమాండ్ రానున్న ఎన్నికల నాటికి ఏ నిర్ణయం తీసుకుంటుందో అన్నది ఆసక్తిగా మారింది. మొత్తానికి పాతపట్నం రాజకీయాలు ఇప్పుడు కొత్త మలుపు తిరుగుతున్నాయనే మాట వినిపిస్తోంది.

# రంగా నాడుకు సిద్ధం..

విశాఖపట్టణం,డిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

సుమారు నాలుగు దశాబ్దాల క్రితం కాపు సమాజంలో రాజకీయ చైతన్యానికి నాంది పలికిన ఒక చారిత్రక ఘట్టం జరిగింది. కాపునాడు పేరుతో తొలి భారీ సభను వంగవీటి మోహన రంగారావు నిర్వహించారు. ఆ సమయంలో ఆయన విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నారు. కాపు సామాజిక వర్గానికి రాజకీయంగా గుర్తింపు, గౌరవం కావాలన్న ఆకాంక్షకు ఆ సభ ప్రతీకగా నిలిచింది. ఆ ఒక్క సభతోనే రంగా పేరు రాష్ట్ర రాజకీయాల్లో మార్మోగింది. విజయవాడ పరిధిలోనే పరిమితమయ్యే నేతగా కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక కేంద్రంగా ఆయన ఎదిగారు. రంగా రాజకీయ ప్రస్థానం సామాజిక ఉద్యమాలతో ముడిపడి సాగింది. పేదలు, బడుగు వర్గాల కోసం ఆయన చేసిన పోరాటాలు ప్రజల్లో ఆయనకు ప్రత్యేక స్థానం తెచ్చిపెట్టాయి. అయితే 1988 డిసెంబర్ 26న విజయవాడలోనే ఆయన హత్యకు గురికావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనంగా మారింది. ఆ తర్వాత కూడా కాపునాడు వేదికపై అనేక మంది నాయకులు ముందుకు వచ్చి, సమాజంలో చైతన్యం కొనసాగించే ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో విశాఖపట్నం వేదికగా 'రంగా నాడు' పేరిట ఒక భారీ సభ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. రంగా వర్ధంతి సందర్భంగా జరిగే ఈ కార్యక్రమాన్ని ఆయన అభిమానులు, అనుచరులు కలిసి నిర్వహిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రముఖులను ఆహ్వానిస్తూ, విశాఖ బీచ్ వద్ద లక్ష మందికిపైగా ప్రజలతో సభ నిర్వహించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నారు. ఈ ప్రకటనతోనే విశాఖ జిల్లా తో పాటు కోస్తా ప్రాంతం అంతటా ఆసక్తి నెలకొంది. ఈ సభలో ఏ అంశాలు ప్రస్తావిస్తారు, ఎలాంటి తీర్మానాలు తీసుకుంటారు అన్నదానిపై ఇప్పటికే చర్చలు మొదలయ్యాయి. రంగా తన జీవితమంతా సామాజిక న్యాయం కోసం అంకితం చేశారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని అభిమానులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం జూలై 4న ఆయన జయంతి రోజున, అలాగే డిసెంబర్ 26న వర్ధంతి రోజున విగ్రహావిష్కరణలు, నివాళి కార్యక్రమాలు నిర్వహించడం సంప్రదాయంగా మారింది. కానీ ఈసారి విశాఖలో లక్షలాది మందితో సభ నిర్వహించాలనే ఆలోచన రాజకీయంగా, సామాజికంగా కూడా ఉత్కంఠను పెంచుతోంది. సాగర ఘోషలా సాగే ఈ రంగా నాడు సభ ఎటువంటి రాజకీయ ప్రకంపనలకు దారితీస్తుందా అన్న ప్రశ్న కూడా వినిపిస్తోంది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్‌లో కాపులు అతి పెద్ద సామాజిక వర్గంగా ఉన్నారు. రాజ్యాధికారం తమకు దక్కాలన్న కోరిక దశాబ్దాలుగా నెరవేరకపోవడం వల్ల కొంత అసంతృప్తి ఉంది. అదే సమయంలో రంగా వంటి నేతల ఆశయాలను యువతకు చేరవేయాలన్న బాధ్యత కూడా ఉందనే భావన కనిపిస్తోంది. మరి విశాఖ వేదికగా జరిగే ఈ సభ ఎలాంటి సందేశాన్ని ఇస్తుందో, ఏ దిశగా చర్చను మళ్లిస్తుందో అన్నది చూడాల్సిందే. అయితే ప్రస్తుతం మాత్రం రంగా నాడుపై అందరి చూపూ కేంద్రీకృతమై ఉందన్నది వాస్తవం.

# డ్రంకన్ డ్రైవ్ లో పాల్గొన్న సీపీ సజ్జనర్

హైదరాబాద్ డిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

బంజారాహిల్స్‌లోని టీజీ స్టడీ సర్కిల్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను బుధవారం అర్ధరాత్రి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. తనిఖీలు జరుగుతున్న విధానాన్ని, సిబ్బంది పనితీరును పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. డ్రంకెన్ డ్రైవ్లో పట్టుబడిన వారితో మాట్లాడి.. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించారు. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు సీపీ తెలిపారు. డిసెంబరు 31 రాత్రి వరకు నగరవ్యాప్తంగా 'స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ డ్రైవ్' నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏడు ప్లాటూన్ల అదనపు బలగాలతో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని 120 ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడిపితే ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

తనిఖీల్లో పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు రూ.10 వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. తీవ్రతను బట్టి డ్రైవింగ్ లైసెన్సు్ను శాశ్వతంగా రద్దు చేసేలా రవాణా శాఖకు సిఫార్సు చేస్తామన్నారు.

# రంగా నాడుకు సిద్ధం..

విశాఖపట్టణం, డిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

సుమారు నాలుగు దశాబ్దాల క్రితం కాపు సమాజంలో రాజకీయ చైతన్యానికి నాంది పలికిన ఒక చారిత్రక ఘట్టం జరిగింది. కాపునాడు పేరుతో తొలి భారీ సభను వంగవీటి మోహన రంగారావు నిర్వహించారు. ఆ సమయంలో ఆయన విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నారు. కాపు సామాజిక వర్గానికి రాజకీయంగా గుర్తింపు, గౌరవం కావాలన్న ఆకాంక్షకు ఆ సభ ప్రతీకగా నిలిచింది. ఆ ఒక్క సభతోనే రంగా పేరు రాష్ట్ర రాజకీయాల్లో మార్మోగింది. విజయవాడ పరిధిలోనే పరిమితమయ్యే నేతగా కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక కేంద్రంగా ఆయన ఎదిగారు.రంగా రాజకీయ ప్రస్థానం సామాజిక ఉద్యమాలతో ముడిపడి సాగింది. పేదలు, బడుగు వర్గాల కోసం ఆయన చేసిన పోరాటాలు ప్రజల్లో ఆయనకు ప్రత్యేక స్థానం తెచ్చిపెట్టాయి. అయితే 1988 డిసెంబర్ 26న విజయవాడలోనే ఆయన హత్యకు గురికావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనంగా మారింది. ఆ తర్వాత కూడా కాపునాడు వేదికపై అనేక మంది నాయకులు ముందుకు వచ్చి, సమాజంలో చైతన్యం కొనసాగించే ప్రయత్నాలు చేశారు.ఇప్పుడు అదే స్ఫూర్తితో విశాఖపట్నం వేదికగా 'రంగా నాడు' పేరిట ఒక భారీ సభ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. రంగా వర్ధంతి సందర్భంగా జరిగే ఈ కార్యక్రమాన్ని ఆయన అభిమానులు, అనుచరులు కలిసి నిర్వహిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రముఖులను ఆహ్వానిస్తూ, విశాఖ బీచ్ వద్ద లక్ష మందికిపైగా ప్రజలతో సభ నిర్వహించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నారు. ఈ ప్రకటనతోనే విశాఖ జిల్లా తో పాటు కోస్తా ప్రాంతం అంతటా ఆసక్తి నెలకొంది.ఈ సభలో ఏ అంశాలు ప్రస్తావిస్తారు, ఎలాంటి తీర్మానాలు తీసుకుంటారు అన్నదానిపై ఇప్పటికే చర్చలు మొదలయ్యాయి. రంగా తన జీవితమంతా సామాజిక న్యాయం కోసం అంకితం చేశారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని అభిమానులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం జూలై 4న ఆయన జయంతి రోజున, అలాగే డిసెంబర్ 26న వర్ధంతి రోజున విగ్రహావిష్కరణలు, నివాళి కార్యక్రమాలు నిర్వహించడం సంప్రదాయంగా మారింది. కానీ ఈసారి విశాఖలో లక్షలాది మందితో సభ నిర్వహించాలనే ఆలోచన రాజకీయంగా, సామాజికంగా కూడా ఉత్కంఠను పెంచుతోంది.సాగర ఘోషలా సాగే ఈ రంగా నాడు సభ ఎటువంటి రాజకీయ ప్రకంపనలకు దారితీస్తుందా అన్న ప్రశ్న కూడా వినిపిస్తోంది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్‌లో కాపులు అతి పెద్ద సామాజిక వర్గంగా ఉన్నారు. రాజ్యాధికారం తమకు దక్కాలన్న కోరిక దశాబ్దాలుగా నెరవేరకపోవడం వల్ల కొంత అసంతృప్తి ఉంది. అదే సమయంలో రంగా వంటి నేతల ఆశయాలను యువతకు చేరవేయాలన్న బాధ్యత కూడా ఉందనే భావన కనిపిస్తోంది. మరి విశాఖ వేదికగా జరిగే ఈ సభ ఎలాంటి సందేశాన్ని ఇస్తుందో, ఏ దిశగా చర్చను మళ్లిస్తుందో అన్నది చూడాల్సిందే. అయితే ప్రస్తుతం మాత్రం రంగా నాడుపై అందరి చూపూ కేంద్రీకృతమై ఉందన్నది వాస్తవం.

# పెద్దిరెడ్డికి బౌండరీస్...


తిరుపతి, డిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):



అధికారంలో ఉన్నప్పుడు అన్నీ కలిసి వస్తాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే నేతల బలాలు తెలుస్తాయి. ఇప్పుడు సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరిస్థితి అదే. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఆయన రాయలసీమకు ముఖ్యమంత్రిగా వ్యవహరించేవారు. రాయలసీమ పరిధిలోని నాలుగు జిల్లాలు ఆయన కంట్రోల్లో ఉండేవి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సీనియర్ కావడం.. ఆయన కుమారుడు మిథున్ రెడ్డి జగన్మోహన్ రెడ్డికి సన్నిహితుడు కావడంతో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించారు రామచంద్రారెడ్డి. చంద్రబాబుకు సమకాలీకుడు కావడంతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తన చెంత ఉంచుకున్నారు జగన్మోహన్ రెడ్డి. ఆయనకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. 2014లో రాయలసీమలో వైసీపీ హవా నడిచింది. 2019లో క్లీన్ స్వీప్ చేసింది. అంతవరకు ఓకే కానీ.. 2024 ఎన్నికల్లో అదే రాయలసీమలో ఏడు స్థానాలకు పడిపోయింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. దీంతో అదంతా హవా తప్ప పెద్దిరెడ్డి లాంటి సీనియర్ల ప్రమేయం లేదన్న నిర్ధారణకు వస్తున్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు.సొంత జిల్లా చిత్తూరులోపెద్దిరెడ్డి కంట్రోల్లో ఉండేది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అక్కడ భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆర్కే రోజా లాంటి నేతలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉండేవారు. పెద్దిరెడ్డి పెద్దరికాన్ని అయిష్టంగానే గౌరవించేవారు. దానికి కారణం జగన్మోహన్ రెడ్డితో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం. అయితే ఇప్పుడు మాత్రం సీన్ మారింది. ముఖ్యంగా నగిరి నియోజకవర్గ విషయంలో రోజా పట్టు బిగిస్తున్నారు. తన నియోజకవర్గంలో పెద్దిరెడ్డి మనుషుల పెత్తనాన్ని సహించుకోలేకపోయారు. జగన్మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయేది. కానీ ఇప్పుడు మాత్రం పెద్దిరెడ్డి ప్రమేయాన్ని ఎంత మాత్రం సహించడం లేదు. పెద్దిరెడ్డి మనుషులను పార్టీ నుంచి బయటకు పంపుతారా? లేకుంటే తానే వెళ్లిపోమంటారా అంటూ రోజా గట్టిగానే హెచ్చరించినట్లు ప్రచారం నడుస్తోంది.ప్రస్తుతం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫుల్ సైలెన్స్ పాటిస్తున్నారు. భూమన కరుణాకర్ రెడ్డి తో పాటు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి జగన్ వద్ద ప్రాధాన్యత లభిస్తున్నట్లు సమాచారం. చెవిరెడ్డి అరెస్టు జరిగిన తర్వాత ఏ నేతకు లేనంత ప్రాధాన్యత ఆయనకు ఇస్తున్నట్లు తెలుస్తోంది. అసలు జైలుకెళ్లిన పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని జగన్ కలుసుకునేందుకు కూడా ఇష్టపడలేదట. కానీ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి న్యాయ సహాయం అందిస్తున్నారట. ప్రస్తుతం భూమన కరుణాకర్ రెడ్డి సైతం చిత్తూరు జిల్లాలో యాక్టివ్ అయ్యారు. ఇప్పటివరకు ఒక లెక్క ఇకనుంచి ఒక లెక్క అన్నట్టు ఉంది వైసీపీ సీనియర్ల పరిస్థితి. పెద్దిరెడ్డి తమ నియోజకవర్గాల్లో వేలు పెట్టకూడదని చిత్తూరు వైసీపీ సీనియర్ నాయకుడు విజయానంద రెడ్డి సైతం తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో పెద్దిరెడ్డి పెద్దరికం అమాంతం పడిపోయినట్టు కనిపిస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# దీన జన బాంధవుడు బాబా ఆమ్టే-నేడు ఆయన జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )



నిరు పేదలు, అన్నార్తుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి బాబా ఆమ్టే.. అతని అసలు పేరు మురళీధర్ దేవదాస్ ఆమ్టే. ప్రముఖ సంఘసేవకుడిగా ప్రసిద్ధిగాంచిన బాబా ఆమ్టే ముఖ్యంగా కుష్టు రోగుల పాలిట దేవుడిగా మారినాడు.డిసెంబర్ 26, 1914లో మహారాష్ట్రలోని వార్ధా జిల్లా హింగన్‌ఘాట్‌లో ఒక ఉన్నత దేశస్థ బ్రాహ్మణ జాగిర్దార్ కుటుంబంలో జన్మించాడు. అతని అసలు పేరు మురళీధర్ దేవదాస్ అమ్టే కాగా చిన్నతనంలోనే అతన్ని బాబా అని పిలిచేవారు. బాబా అనేది ఎవరో ప్రధానం చేసిన బిరుదు కాదు అది తల్లిదండ్రులు పెట్టిన ముద్దుపేరు. న్యాయశాస్త్రంలో శిక్షణ పొందిన తరువాత వార్ధాలో న్యాయ అభ్యాసం ప్రారంభించాడు. అదే సమయంలో భారత జాతీయోద్యమ పోరాటం జరుగుతుండేది. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో అరెస్ట్ కాబడిన జాతీయ నేతల తరపున కోర్టులలో వాదించేవాడు. క్రమక్రమంగా మహాత్మా గాంధీ వైపు ఆకర్షితుడైనాడు. గాంధీజీతో పాటు కొంత కాలం సేవాగ్రం ఆశ్రమంలో గడిపినాడు. ఆ తరువాత జీవితాంతం వరకు గాంధీజీ సిద్ధాంతాలకే కట్టుబడినాడు. వేషధారణలో కూడా గాంధీజీ వలె ఖద్దరు దుస్తులనే వాడేవాడు. గాంధీజీ వలె జీవితాంతం అణగారిన వర్గాల కృషికై పాటుపడ్డాడు.సమాజంలోని రుగ్మతలు, పేదల దీన స్థితికి చలించే ఆయన తన జీవితాన్ని కుష్టు రోగుల సేవలకు, వారి పునరావాసానికి కృషి చేశారు. పర్యావర్ణ పరిరక్షణకూ, అడవులు పెంపకానికి ఆయన కృషి చేశారు.కుష్టురోగుల సేవలకై చంద్రాపూర్ జిల్లాలో ఆనంద్‌వన్ ఆశ్రమాన్ని స్థాపించి అతను కూడా వారితోపాటే అక్కడే జీవితాన్ని గడిపి 2008, ఫిబ్రవరి 9న తన ఆశ్రమంలోనే మృతి చెందిన మహనీయుడు. ఉన్నత కుటుంబంలో జన్మించి భోగభాగ్యాలను వదిలి అణగారిన వర్గాల మేలు కొరకై జీవితాంతం కృషిసల్పిన అతని కృషి మరవలేనిది.బాబా ఆమ్టే సేవలకు గుర్తింపుగా అనేక అంతర్జాతీయ, జాతీయ అవార్డులు వచ్చాయి. రామన్ మెగసేసే అవార్డు, జాతీయ పద్మ అవార్డులు ఆయనను వరించాయి. డిసెంబర్ 26, 2018న, సెర్చ్ ఇంజన్ గూగుల్ అతని 104వ పుట్టినరోజు సందర్భంగా, గూగుల్ డూడుల్‌తో అతనిని స్మరించుకుంది. ఆయన ఈ లోకం విడిచి వెళ్లిపోయిన ఆమ్టే కుమారుడు ప్రకాశ్ ఆమ్టే తండ్రి సేవలను కొనసాగిస్తున్నారు. ఆయన బాటలోనే నడిచి తండ్రికి తగ్గ తనయుడిగానే గుర్తింపు తెచ్చుకున్నారు.

# నేడు స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ ఉద్దం సింగ్ జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని

)బహూశా సర్దార్ ఉద్దం సింగ్ గురించి చాలా అందికి తెలిసి ఉండదు. ఉద్దం సింగ్ ను షహీద్-ఎ-అజం అంటారు అంటే వీరులలో అగ్రుజుడు అని అర్థం. ఉద్దమ్ సింగ్ పంజాబ్ లోని సంగ్రూర్ జిల్లా లోని సునం తెహసీల్ కు చెందిన కలన్ గ్రామంలో డిసెంబరు 26, 1899లో జన్మించారు.1919లొ తన కళ్లముందే పంజాబ్ లేఫ్టనేంట్ గవర్నర్ మైఖేల్ ఫ్రాన్సిస్ ఓ డయ్యర్ ను జలియన్ వాలాబాగ్ లొ 1200 మందిని పిట్టలను కాల్చినట్టు కాల్చడం చూసి చలించిపొయారు. ఇంత మంది రక్తం కళ్లచూసిన డయ్యర్ ను చంపకపొతే నేను భారతీయుడనే కాదు అని అక్కడి శవాలపై శపథం చేశారు. ముందుగా ఉద్దం సింగ్, భగత్ సింగ్ పని చేస్తున్న గద్దర్ పార్టీ లొ చేరారు. అక్కడే షూటింగ్ చేయడం, గూఢచర్యం చేయడం నేర్చుకున్నారు. 1935 లొ బ్రీటీష్ వారు కన్నుగప్పి కాశ్మీరు చేరుకుని అక్కడి నుండి జర్మనీ వెళ్ళారు.

అక్కడి నుండి కూలివాడిగా లండన్ చేరుకుని జనరల్ డయ్యర్ పై గూఢచర్యం చేయడం మొదలు పెట్టారు. లండన్ లొ అనేక రొజులు తిండిలేక నీళ్ళు తాగి బతికేవాడు.1940 లొ జనరల్ డయ్యర్ ఈస్టు ఇండియా కపెనీ సమావేశం కు వెళ్తున్నాడన్ని తెలుసుకుని ముందుగా అక్కడికి చేరుకున్నారు. కాసేపటికి డయ్యర్ రావడంతొ మెరుపువేగంతొ అతనిముందు ప్రత్యక్షమైనా భారతీయుల ప్రాణాలకు నీకు ఇదే శిక్షరా కుక్క అంటూ కుక్కను కాల్చినట్టు కాల్చి చంపాడు. తరువాత 17 రొజులకు 1940 జూలై 31న పెంటన్‌విల్ల్ కారాగారములో ఉద్దం సింగు ను 40 ఏళ్ల వయసులో బ్రీటిష్ ప్రభుత్వం ఉరితీసింది. తిండి లేకపొయినా పగతొ బ్రతికేయవచ్చు అని మన సినిమాలలొ ఉపయొగించే డైలాగు ఈయన చెప్పినవే.

# ఏపీలో 70 అన్న క్యాంటీన్లు

విజయవాడ, డడిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామీణ ప్రజలకు శుభవార్త అందించింది. నియోజకవర్గ, మండల కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు కాబోతున్నాయి. మొత్తం 70 అన్న క్యాంటీన్లను ఒకేసారి ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్నారు. జనవరి 10లోగా నిర్మాణ పనులు పూర్తి చేసి.. జనవరి 13 నుంచి 15 మధ్య ఈ క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు విజయవంతం అయ్యాయి.. ప్రజల నుంచి ఆదరణ వస్తోంది. అందుకే గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా మొత్తం 70 క్యాంటీన్లను మంజూరు చేసింది. ప్రస్తుతం పట్టణాల్లో 205 అన్న క్యాంటీన్లు నడుస్తున్నాయి.. వీటిలో రోజుకు మూడు పూటలా కలిపి 2 లక్షల మందికి పైగా ప్రజలు తక్కువ ధరకే భోజనం చేస్తున్నారు. ఉదయం, రాత్రి టిఫిన్, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు. ఒక్కో పూటకు కేవలం రూ.5కే రుచికరమైన ఫుడ్ అందిస్తున్నారు. ఈ పథకం గ్రామీణ ప్రజలకు కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో నగరాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన 205 అన్న క్యాంటీన్ల ద్వారా పేదల ఆకలి తీరుస్తున్నారు. ఇప్పటివరకు 7.20 కోట్ల మందికి పైగా ప్రజలు ఈ క్యాంటీన్లలో భోజనం చేశారు. ఇందులో మధ్యాహ్న భోజనం చేసిన వారి సంఖ్య 3.16 కోట్లు. ఉదయం అల్పాహారం 2.62 కోట్ల మంది, రాత్రి భోజనం 1.42 కోట్ల మంది తీసుకున్నారు. ఈ క్యాంటీన్లలో విశాఖపట్నం, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుండి అత్యధిక సంఖ్యలో పేదలు వస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ జిల్లాల్లోని క్యాంటీన్లలో రద్దీ ఎక్కువగా ఉంటోంది. పేదల ఆకలి తీర్చడమే ఈ క్యాంటీన్ల ముఖ్య ఉద్దేశ్యం. తక్కువ ధరకే నాణ్యమైన ఆహారాన్ని అందించడం ద్వారా ఎంతో మందికి అండగా నిలుస్తున్నాయి. ఇప్పుడు గ్రామాల్లో కూడా అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నారు.జిల్లాల వారీగా చూస్తే.. చిత్తూరు 7, గుంటూరు 5, శ్రీకాకుళం జిల్లా 5, తూర్పుగోదావరి 4, ఏలూరు 4, ప్రకాశం 4, కర్నూలు 4, విజయనగరం 3, అనంతపు?రం 3, అల్లూరి సీతారామరాజు 3, అనకాపల్లి 3, బీఆర్ అంబేద్కర్ కోనసీమ 3, పశ్చిమ గోదావరి 3, కృష్ణా 3, నెల్లూరు 3, అన్నమయ్య 3, కాకినాడ 2, తిరుపతి 2, పార్వతీపురం మన్యం 1, పల్నాడు 1, ఎన్టీఆర్ 1, శ్రీసత్యసాయి 1, నంద్యాల 1, కడప 1 క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నారు




# పీవీ సునీల్ కుమార్‌పై వేటు...

గుంటూరు, డడిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రంలో ప్రస్తుతం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ మధ్య పెద్ద యుద్ధమే నడుస్తోంది. ఈ పోరు కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవగా కాకుండా.. చట్టం, సర్వీస్ నిబంధనలు, రాజకీయ వ్యవస్థల మధ్య ఘర్షణగా మారుతోంది. గత కొన్నాళ్లుగా వీరి మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధం, సీబీఐ ఎఫ్ఐఆర్ నేపథ్యంలో తారాస్థాయికి చేరింది.బ్యాంకుల కన్సార్టియంను మోసం చేశారనే ఆరోపణలపై రఘురామ కృష్ణరాజుపై సీబీఐ తాజాగా కేసు నమోదు చేయడం ఈ వివాదాన్ని మలుపు తిప్పింది. దీనిని అస్త్రంగా చేసుకున్న పీవీ సునీల్ కుమార్, సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలకు దిగారు. ఒక రాజ్యాంగబద్ధమైన డిప్యూటీ స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిపై ఆర్థిక నేరారోపణలు రావడం నైతికంగా తప్పని, ఆయన తక్షణమే పదవి నుంచి తప్పుకోవాలని సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. ఒక అడుగు ముందుకు వేసి, రఘురామకు యావజ్జీవ శిక్ష తప్పదని, అవసరమైతే తాను కూడా ఆ కేసులో ఇంప్లీడ్ అవుతానని వీడియో సందేశం విడుదల చేయడం సంచలనం రేకెత్తించింది.ఈ వివాదంలో ప్రధానంగా వినిపిస్తున్న ప్రశ్న.. "సస్పెన్షన్‌లో ఉన్న ఒక ఐపీఎస్ అధికారి రాజకీయ విమర్శలు చేయవచ్చా?" అనేది. 1968 ప్రకారం, సర్వీసులో ఉన్న అధికారి సస్పెన్షన్‌లో ఉన్నా సరే ప్రభుత్వంపై గానీ, రాజకీయ నేతలపై గానీ బహిరంగంగా విమర్శలు చేయకూడదు. నియమం 7 ప్రకారం ఏ అధికారి కూడా ప్రభుత్వం లేదా వ్యవస్థల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ప్రకటనలు చేయకూడదు. సివిల్ సర్వెంట్స్ రాజకీయాలకు అతీతంగా ఉండాలి. కానీ, సునీల్ కుమార్ నేరుగా డిప్యూటీ స్పీకర్‌ను ఉద్దేశించి జైలుకు వెళ్లడం ఖాయం, యావజ్జీవ కారాగార శిక్ష పడుతుంది.. అని వ్యాఖ్యానించడం సర్వీస్ రూల్స్‌ను ఉల్లంఘించడమేనని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.తనపై వ్యక్తిగత దాడికి దిగడమే కాకుండా, న్యాయస్థానంలో ఉన్న కేసులను ప్రభావితం చేసేలా సునీల్ కుమార్ మాట్లాడుతున్నారని రఘురామ కృష్ణరాజు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు ఫిర్యాదు చేశారు. సునీల్ కుమార్‌ను కేవలం సస్పెన్షన్‌తో వదిలేయకుండా, సర్వీస్ నుంచి పూర్తిగా డిస్మిస్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక ఐపీఎస్ అధికారి ఇలా వీధి రౌడీలా మాట్లాడటం వ్యవస్థలకే ప్రమాదకరమని ఆ లేఖలో పేర్కొన్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకునే అవకాశం కనిపిస్తోంది. సాధారణంగా ఇలాంటి ఫిర్యాదులు వచ్చినప్పుడు ప్రభుత్వం కొన్ని రూల్స్ ఫాలో అవుతుంది. మొదట నిబంధనల ఉల్లంఘనపై షోకాజ్ నోటీస్ ఇచ్చి వివరణ కోరుతుంది. ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్న సునీల్ కుమార్‌పై కొత్త అభియోగాలతో సస్పెన్షన్ కాలాన్ని పొడిగించే అవకాశం ఉంటుంది. ఐపీఎస్ అధికారులు కేంద్ర హోంశాఖ పరిధిలోకి వస్తారు కాబట్టి, విచారణ నివేదికను ఢిల్లీకి పంపడం. ఒకవేళ నేరం రుజువైతే ఆయన సర్వీస్ నుంచి తొలగించబడే ప్రమాదం ఉంది.రఘురామ కృష్ణరాజుపై ఉన్న సీబీఐ కేసు చట్టపరంగా నడుస్తుంది. కానీ, ఒక ఐపీఎస్ అధికారి ఆ తీర్పును ముందే ప్రకటించడం, రాజకీయ విమర్శలు చేయడం ఖచ్చితంగా చర్చనీయాంశమే.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
ద.మ రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్
website:www.scr.indianrailways.gov.in

**Tender No.: Y/SG/36/ 2025-26/30, Dated : 23-12-2025** PUB/1653

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ / హైదరాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ ఈ క్రింది పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లను ఆహ్వానిస్తున్నారు. తేది : 22.01.2026 న 11.30 గం॥ల వరకు సేకరించబడును.

క్రమ సంఖ్య :1. టెండర్ నెం.: Y/SG/36/ 2025-26/30 పనిపేరు : హైదరాబాద్ విభాగం : ఆకాంక్షను అందించడం హైదరాబాద్ డివిజన్‌లోని 67 ప్రదేశాలలో రిలే రూమ్, ఎక్విప్‌మెంట్ రూమ్ మరియు బ్యాటరీ రూమ్‌లలో సిస్టమ్. అంచనా వ్యయం : రూ. 5,01,58,746.00, ఇఎండి : రూ.4,00,800.00

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ / హైదరాబాద్

**E-Tender Notice No.: GNT/SG/36/357, Dated : 18-12-2025** PUB/1654

క్రింది పేర్కొన్న పనుల కోసం క్రింద సంతకం చేసిన వారు తేది : 09.01.2026 సాయంత్రం 4.00 గం॥ల వరకు టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

ఐడి నెంబర్ : 357, పనిపేరు : S&T థిక్ వెబ్‌కి సంబంధించి పనిచేస్తుంది. స్విచ్‌లు (TWS) (ఎ) గుంటూరు డివిజన్ (పశ్చిమ) - FS+TWS+WCMSC-31 సెట్లు, TWS+ WCMSC-28 సెట్లు (మొత్తం:59 సెట్లు), (బి) గుంటూరు డివిజన్ (పశ్చిమ) TWS+ WCMSC-43 సెట్లు, FS+TWS+WCMSC-6 సెట్లు (మొత్తం:49సెట్లు), CS-21 సెట్లు, DS-11 సెట్లు, TFR-5.436 Tkm (ప్యాడ్), GJ-21 సంఖ్యలు, (సి) గుంటూరు డివిజన్ (ఉత్తరం) -FS+TWS+WCMSC-11సెట్లు, TWS+WCMSC-22 సెట్లు (మొత్తం:33 సెట్లు), GJ-33 సంఖ్యలు, (డి) గుంటూరు డివిజన్ (ఉత్తరం) -TWS+WCMSC-47 సెట్లు. అంచనా వ్యయం : రూ. 6,72,96,726.64, ఇఎండి : రూ.4,86,500.00, టెండర్ ఖర్చు: రూ. లేదు.

1) టెండర్లు తెరిచే తేదీ తరువాత సెలవు దినంగా ప్రకటించబడితే, తదుపరి పని దినం నిర్ణీత సమయంలో టెండర్లు తెరువబడతాయి.
2) ఈ-బిడ్‌లను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి చివరి తేదీలు : 09.01.2026 నుండి సా॥ 4.00 గంటల వరకు, వివరణాత్మక సమాచారం కోసం www.ireps.gov.in వద్ద మా వెబ్‌సైట్‌ను సందర్శించండి.
3) తదుపరి ఏవైనా కమ్యూనికేషన్ దిద్దుబాట్లు ఈ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా మాత్రమే తెలియజేయబడతాయి.

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ / గుంటూరు.

**Tender No.: Y/SG/36/ 2025-26/31, Dated : 24-12-2025** PUB/1655

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ / హైదరాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ తేది : 23.01.2026 నుండి 11.30 గం॥ల వరకు ఈ క్రింది పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్రమ సంఖ్య :1. టెండర్ నెం.: Y/SG/36/ 2025-26/31, పనిపేరు : హైదరాబాద్ డివిజన్ : హైదరాబాద్ డివిజన్-టెలికాం ఏర్పాట్లలో కేబుల్స్ విశ్వసనీయత మరియు నిర్వహణ కార్యకలాపాలను మెరుగుపరచడానికి SSE/JE కి వివిధ కేబుల్స్ పరీక్షా సాధనాలను అందించడం. అంచనా వ్యయం : రూ. 2,88,08,898.00, ఇఎండి : రూ.2,94,100.00

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ / హైదరాబాద్

**Tender Notice No.: G/E.29/Tr./ Tender Notice/36/2025-26** PUB/1656

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ / ట్రాక్షన్ / గుంతకల్ వారు క్రింది పనులకు ఈ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ నెం.:GTL-TRD-29-eTN-64-2025-26, పనిపేరు : గుంతకల్ డివిజన్ OHE మార్పులు ప్రతిపాదితతో కనెక్షన్ PSC స్లాబ్‌లతో భర్తీ (పోస్ట్ స్టీల్ గిర్డర్స్ వంతెన కోసం టెన్షన్ చేయబడింది) నం.550 డౌన్ (10x9.14) వద్ద GPY మధ్య కి.మీ.నం. 274/28-75/2-KPU స్టేషన్లు మరియు (Br.No.96) ఎక్స్‌గ్.స్పాన్ 5x12.20మీ, 207 ఎక్స్‌గ్‌స్పాన్ 4x12.20మీ, 152 ఎక్స్‌గ్ స్పాన్ 1x12.20మీ, 122 ఎక్స్‌గ్‌స్పాన్ 2x12.20మీ, 121 ఎక్స్‌గ్‌స్పాన్ 2x12.20మీ, 118 ఎక్స్‌గ్‌స్పాన్ 3x12.20మీ, 115 ఎక్స్‌గ్‌స్పాన్ 3x12.20మీ, 113 ఎక్స్‌గ్‌స్పాన్ 2x12.20మీ & 109 ఎక్స్‌గ్‌స్పాన్ 3x12.20మీ (9 సంఖ్యలు) మధ్య GTL-NDL విభాగం మరియు వంతెన నం.251 RU-GY లో 171/4-10 వద్ద DN(5x14.85M) విభాగం. అంచనా వ్యయం : రూ.73,93,346, ఈఎండి:రూ.1,47,900

టెండర్ ముగింపు తేదీ & సమయం : 16.01.2026 మధ్యాహ్నం : 3.00 గంటలకు
1) టెండర్ దారులు టెండర్ పత్రాన్ని www.ireps.gov.in వెబ్‌సైట్ నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
2) టెండర్ బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కోసం https://www.ireps.gov.in కు లాగిన్ అవ్వండి. ఏదైనా దిద్దుబాటు పత్రం ఉంటే ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ / ట్రాక్షన్ / గుంతకల్

**E-Tender Notice No.: DRM/Works/BZA/44/2025, Dated : 24.12.2025** PUB/1657

భారత రాష్ట్రపతి తరపున క్రింద సంతకం చేసిన వారు మధ్యాహ్నం 3.00 గంటల వరకు మరియు ప్రతి దాని ఎదురుగా పేర్కొన్న తేదీ వరకు క్రింది పనులకు ఈ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్రమసంఖ్య: 1. టెండర్ నెం.: E-40-CENTRAL-BZA-2025, పనిపేరు : SWI:BZA డివిజన్: BZAS-GDR విభాగం : DEN / సెంట్రల్/BZA పరిధిలోని ADEN/BPP సబ్-డివిజన్‌లోని SSE/వర్క్స్/BPP&TEL విభాగాలలోని LC నెం.230 నుండి 310 (57 గేట్లు) వద్ద అప్రోచ్ రోడ్ల మరమ్మతులు మరియు మెరుగుదలలు. SW II : BZA డివిజన్: BZA-VSKP విభాగం: DEN/సెంట్రల్/BZA పరిధిలోని ADEN/EE సబ్-డివిజన్‌లోని SSE/ వర్క్స్/EE విభాగాలలోని LC నెం.316 నుండి 363బి (23 గేట్లు) వద్ద అప్రోచ్ రోడ్ల మరమ్మతులు మరియు మెరుగుదలలు. అంచనా వ్యయం : రూ.4,83,94,312, ఈఎండి:రూ.3,92,000. పూర్తిచేయు కాలం: 12 (పన్నెండు) నెలలు. ముగింపు తేదీ: 07.01.2026

1. టెండర్ షరతులు/పూర్తిగా పనిపేరు వివరాలు, పైన పేర్కొన్న పనుల సారూప్యత, అర్హత ప్రమాణాలు మొదలైన ఇతర వివరాలు https://www.ireps.gov.in వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి.
2.టెండర్ ముగింపు తేదీకి ముందు, సంభావ్య టెండరుదారులు https://www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి, ఏదైనా టెండర్‌కు సంబంధించిన ఏవైనా మార్పులు / దిద్దుబాటులను గమనించాలని సూచించబడింది.

డివిజనల్ రైల్వే మేనేజర్, (వర్క్స్), విజయవాడ.

A2107

మరిన్ని టెండర్ నిబంధనలు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి,
https://www.ireps.gov.in
లేదా
www.scr.indianrailways.gov.in
వెబ్‌సైట్‌ను సందర్శించండి

# జగన్ ఫ్యామిలీతో మేనల్లుడు

కడప, డిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి క్రిస్మస్ ప్రత్యేకం. దశాబ్దాలుగా ఆ కుటుంబం క్రిస్టియానిటీని అనుసరిస్తూ వస్తోంది. అయితే ఎంత దూరంలో ఉన్న క్రిస్మస్ పర్వదినాల నాడు



పులివెందుల రావడం ఆనవాయితీగా ఉంది. రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత ఇది కాస్త ఎక్కువైంది. జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో కుటుంబమంతా ఒకచోట కలిసి క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటూ వస్తోంది. 2019 ఎన్నికల వరకు అంతా కలిసి ఉంది ఆ కుటుంబం. కానీ తదనంతర పరిణామాలతోనే ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు మారిపోయారు. వివేకానంద రెడ్డి హత్య కేసు, ఆపై సోదరుడితో షర్మిల విభేదించడం వంటి కారణాలతో ఆ కుటుంబంలో చీలిక స్పష్టంగా కనిపించింది. ఇప్పుడు రాజకీయంగా జగన్మోహన్ రెడ్డితో షర్మిల విభేదించడంతో ఆ రెండు కుటుంబాలు కలిసే అవకాశం లేకుండా పోయింది. ఇటువంటి పరిస్థితుల్లో ఇటీవల జగన్మోహన్ రెడ్డి జన్మదినం నాడు శుభాకాంక్షలు తెలిపారు షర్మిల. థాంక్యూ షర్మిలమ్మ అంటూ జగన్మోహన్ రెడ్డి సైతం స్పందించారు. ప్రస్తుతం జగన్మోహన్ రెడ్డి పులివెందుల పర్యటనలో ఉన్నారు. అక్కడే క్రిస్మస్ వేడుకలకు హాజరయ్యారు. ఈ క్రమంలో ఒక ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. కుటుంబమంతా ఒకే ఫ్రేమ్ లోకి వచ్చింది. జగన్మోహన్ రెడ్డి, భార్య భారతి, తల్లి విజయమ్మ తో పాటు ఇతర కుటుంబ సభ్యులంతా ఒకే చోట క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నట్లు తెలుస్తోంది. కానీ జగన్ సోదరి షర్మిల మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. రెండు రోజుల కిందట సోదరుడికి జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన సమయంలో వారి మధ్య గొడవలు సద్దుమణిగాయని అంత భావించారు. కానీ ఇంతలోనే ఆ కుటుంబం అంతా ఒకచోట చేరింది. షర్మిల కనిపించలేదు కానీ.. ఆమె కుమారుడు మాత్రం భారతీ రెడ్డి పక్కనే కూర్చుంటూ ఫోటోకు ఫోజులిచ్చారు. దీంతో తెరవెనుక ఏదో జరుగుతోందన్న అనుమానాలు ఉన్నాయి.జగన్మోహన్ రెడ్డితో షర్మిల ను కలిపేందుకు కుటుంబ పెద్దలతో పాటు శ్రేయోభిలాషులు రంగంలోకి దిగినట్లు ప్రచారం నడుస్తోంది. అదే సమయంలో షర్మిల కుమారుడు కుటుంబంతో ఫోటోలకు దిగడం ప్రాధాన్యత సంతరించుకుంది. కొద్ది రోజుల కిందట షర్మిల కుమారుడు వివాహ వేడుకలు జరిగాయి. అయితే ఆ వేడుకలకు జగన్ హాజరు కాలేదు. అంతకుముందు నిశ్చితార్థ వేడుకలకు మాత్రం జగన్ దంపతులు హాజరయ్యారు. మేనల్లుడికి శుభాకాంక్షలు తెలిపారు. అప్పట్లో కూడా జగన్మోహన్ రెడ్డితో ఫోటోలు దిగేందుకు షర్మిల అయిష్టత చూపినట్లు సోషల్ మీడియాలో ప్రచారం నడిచింది. అయితే ఈ మధ్యన ఇద్దరికీ పొలిటికల్ డ్యామేజ్ జరగడంతో సంధి కుదిర్చినట్లు ప్రచారం నడిచింది. ఇటువంటి సమయంలోనే జగన్ ఫ్యామిలీతో షర్మిల కుమారుడు కనిపించడం కొత్త చర్చకు దారితీస్తోంది. మున్ముందు ఆ కుటుంబ పరిణామాలు మారే అవకాశం ఉంది.

మరో వైపు గతంలో కూడా అనేక రాజకీయ కుటుంబాల్లో ఇలాంటి పరిస్థితులు కనిపించాయి. కానీ జగన్?షర్మిల వ్యవహారం మాత్రం సాధారణ రాజకీయ విభేదాలను దాటి వ్యక్తిగత స్థాయికి వెళ్లిందనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. అందుకే ఈ అంశం ఎప్పటికప్పుడు చర్చకు వస్తూనే ఉంది. రెండు మూడు సంవత్సరాలుగా ఈ ఇద్దరి మధ్య ఉన్న దూరం అసలైన వైఎస్సార్ అభిమానులను బాధపెడుతోంది. తప్పు ఎవరిది, కారణం ఏమిటి అన్నది వేరే విషయం అయినా, ఒకప్పుడు కలిసి రాజకీయంగా ప్రయాణించిన అన్నా చెల్లెళ్లు ఇలా విడివిడిగా ఉండటం వారికి నచ్చడం లేదు. ఎప్పటికైనా ఈ కుటుంబం మళ్లీ ఒక్కటవ్వాలని, పరస్పర విభేదాలు పక్కన పెట్టాలని కోరుకునే వారు ఎక్కువగానే ఉన్నారు.సాధారణంగా "నీటి కంటే రక్తం చిక్కన" అనే మాట రాజకీయాల్లో కూడా చాలాసార్లు నిజమైంది. గతంలో తీవ్రంగా విభేదించిన రాజకీయ నేతలు, కుటుంబ సభ్యులు కాలక్రమంలో మళ్లీ కలిసిన సందర్భాలు ఉన్నాయి. ఆ కోణంలో చూస్తే జగన్, షర్మిల కూడా భవిష్యత్తులో కలిసే అవకాశం ఉందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే అది ఎప్పుడు జరుగుతుందన్నది మాత్రం ఎవరూ స్పష్టంగా చెప్పలేని పరిస్థితి. ఇద్దరూ తమ తమ అభిప్రాయాల్లో గట్టి పట్టుదలతో ఉండటమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. ఇటీవల ఒక యూట్యూబ్ ఇంటర్వ్యూలో కడప జిల్లాకు చెందిన వైసీపీ కీలక నేత, మాజీ ఎమ్మెల్సీ సతీష్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆయన మాట్లాడుతూ జగన్‌కు తన చెల్లెలంటే ప్రత్యేక అభిమానం ఉందని, కుటుంబాన్ని ఎప్పుడూ గొప్పగా భావించే వ్యక్తి అని తెలిపారు. తాను జగన్‌ను దగ్గరగా చూశానని, ఆయన ఎప్పుడూ కావాలని తప్పులు చేసే మనిషి కాదని అన్నారు. తన అనుభవం ప్రకారం జగన్ ఇతరులకు మేలు చేయాలనే ఆలోచనతోనే పనిచేస్తారని వ్యాఖ్యానించారు. అందుకే అన్నా చెల్లెళ్లు మళ్లీ కలిసే అవకాశాన్ని కొట్టిపారేయలేమని ఆయన అభిప్రాయపడ్డారు.ఇదిలా ఉండగా షర్మిల ప్రస్తుతం ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగాబాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆమె ప్రధానంగా అధికార కూటమిపైనే విమర్శలు చేస్తూ వస్తున్నారు. జగన్ గురించి కానీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గురించి కానీ ఆమె బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం లేదు. ఒక రాజకీయ పార్టీ నేతగా అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని విమర్శించడం సహజమేనని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. గతంలో వైసీపీపై తీవ్ర విమర్శలు చేసిన షర్మిల ఇప్పుడు వైఖరిలో మార్పు చూపుతున్నారా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి.మొత్తంగా చూస్తే, జగన్?షర్మిల మళ్లీ కలవాలని కోరుకునే భావన రాజకీయాల్లోనూ, ప్రజల్లోనూ ఉంది. అలాంటి పరిణామం జరిగితే అది సానుకూల మార్పుగా భావిస్తారు. ఇది సాధ్యమవుతుందా లేదా అన్నది కాలమే నిర్ణయించాలి. కానీ ఈ అంశం చర్చలో ఉండటం మాత్రం ఆ కుటుంబంపై ఉన్న అభిమానం ఎంత బలంగా ఉందో చెప్పే సంకేతంగా కనిపిస్తోంది.

## రేవంత్ స్కెచ్ లో కేసీఆర్..
# అసెంబ్లీకి వస్తారా

హైదరాబాద్, డిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

కృష్ణా జలాల విషయంలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన ఆరోపణలపై క్విక్‌గా రియాక్ట్ అయ్యారు సీఎ రేవంత్ రెడ్డి. వెంటనే చిట్ చాట్ పేరుతో అన్ని అంశాలపై మాట్లాడిన సీఎం రేవంత్..ఏకంగా కొడంగల్ వేదికగా గులాబీ బాస్‌కు బిగ్ సవాల్ చేశారు. ఈ నెల 29 నుంచి అసెంబ్లీ స్టార్ట్ అవుతుంది. నీళ్లా..నిధులా..నియమకాలా, సంక్షేమ పథకాలా..ఆప్షన్ మీదే..ఏ అంశామైనా చర్చించేందుకు రెడీ అంటూ ఓపెన్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. ముఖాముఖి తేల్చుకుందాం రమ్మంటూ సవాల్ చేస్తున్నారు. అయితే అన్ని అంశాల కంటే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని రేవంత్ ప్రధాన అస్త్రంగా వాడుకునే అవకాశం ఉందట. అసెంబ్లీ వేదికగా ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని చర్చకు పెట్టి..బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా కార్నర్ చేయాలనేది రేవంత్ వ్యూహమంటున్నారు. సేమ్‌టైమ్ కేసీఆర్ సభకు వస్తే..కృష్ణా జలాల ఎపిసోడ్‌కు కూడా అక్కడే ఫుల్ స్టాప్ పెట్టాలనేది రేవంత్ స్కెచ్అట. సభలు పెట్టి కేసీఆర్ ప్రజల్లోకి వెళ్లే కంటే ముందే అసెంబ్లీకి రావాలంటూ సవాల్ చేస్తూ రేవంత్ కొత్త ఎత్తుగడ వేశారన్న చర్చ జరుగుతోంది. ంశ్రీబనీ ఖీవజీట: నేనూ హీరోయిన్‌నే.. మీది చేతగానితనం.. నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే..: శివాజీపై అనసూయ మళ్లీ ఫైర్. కృష్ణాజలాల అంశంతో పొలిటికల్‌గా యాక్టీవ్ కావాలని కేసీఆర్ ప్లాన్ చేస్తున్నారు. అందుకే నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌లో సభలకు రెడీ అవుతున్నారు. ఈ మీటింగ్‌లకు తాను స్వయంగా హాజరవుతానని..ఇక నుంచి ఐయామ్ ఆన్ ది ఫీల్ అంటూ చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేతగాని తనం వల్లే తెలంగాణకు న్యాయంగా రావాల్సిన నీటి వాటా దక్కడం లేదన్న వాదనను ప్రజల్లోకి తీసుకెళ్లాలనుకుంటున్నారు. అయితే ఇంతలోపే అసెంబ్లీ సమావేశాలు పెట్టి..కేసీఆర్ సభకు రమ్మని సవాల్ చేస్తున్నారు రేవంత్. కేసీఆర్ అసెంబ్లీకి వెళ్తారా? లేదా? అసలు తెలంగాణకు నీటి వివాదాలు రావడానికి కేసీఆరే కారణమంటున్న రేవంత్..పార్టీ ఆఫీసుల్లో కూర్చొని మాట్లాడటం కాదు..దమ్ముంటే అసెంబ్లీకి రావాలంటూ ఛాలెంజ్ విసురుతున్నారు. అయితే కేసీఆర్ అసెంబ్లీకి వెళ్తారా లేదా అన్నది డౌటే. ఎందుకంటే ఆయన ప్రతిపక్షంలోకి వచ్చినప్పటి నుంచి ఏ చర్చలో పాల్గొన్న సందర్భాలు లేవు. తెలంగాణ భవన్‌లో



లేకపోతే ఫాంహౌస్‌లో నేతలను ఉద్దేశించి మాట్లాడటమో..ప్రెస్‌మీట్ పెట్టడమో తప్ప..అసెంబ్లీ వేదికగా అపోజిషన్ లీడర్‌గా ఏ అంశాన్ని ప్రస్తావించలేదు కేసీఆర్. ఇదే అస్త్రంగా మల్చుకుని కేసీఆర్‌ను సభకు రప్పించేందుకు మరోసారి గేమ్ స్టార్ట్ చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. ముఖ్యమంత్రి ముందు నుంచి పదే పదే ప్రస్తావిస్తున్న అంశం ఒకే ఒక్కటి. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని. ఎన్ని సార్లు సవాల్ చేసినా..రేవంత్ మాటలను కేసీఆర్ పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించలేదు. కేటీఆర్, హరీశ్‌తోనే కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల ప్రశ్నలకు సమాధానం చెప్పించారు కేసీఆర్. అయితే రేవంత్ మొత్తం కేసీఆర్ లేవనెత్తిన కృష్ణా జలాల అంశంలో ఆయన చేతనే చేత సమాధానం చెప్పించాలనే ఎత్తుగడ వేస్తున్నట్లు టాక్. అసెంబ్లీ వేదికగా రేవంత్ వర్సెస్ కేసీఆర్ అన్నట్లుగా చర్చ జరగాలనేది సీఎం స్కెచ్ అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే టాపిక్ ఏదైనా చర్చకు రెడీ అంటూ రేవంత్ సవాల్ విసురుతున్నారని అంటున్నారు. అల్టిమేట్‌గా కేసీఆర్‌ను సభకు రప్పించాలన్నది రేవంత్ మైండ్ గేమ్ అన్న ఒపీనియన్స్ వ్యక్తం అవుతున్నాయి. ఒకవేళ రేవంత్ సవాల్‌ను స్వీకరించి కేసీఆర్ సభకు వస్తే..ముందు ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని చర్చకు పెట్టే ప్లాన్ చేస్తున్నారట. కృష్ణావాటర్ విషయంలో కేసీఆర్ కేంద్రం దగ్గర ఒప్పుకున్న అంశాలను ఎక్స్‌పోజ్ చేస్తూ..తెలంగాణకు నీటి వాటాలు దక్కకుండా చేశారని వివరించాలని అనుకుంటున్నారట. మరి రేవంత్ సవాల్‌ను స్వీకరించి కేసీఆర్ అసెంబ్లీకి వస్తారా లేక ఎప్పటిలాగే లైట్ తీసుకుంటారా అనేది వేచి చూడాలి.

## పొలిటికల్ థ్రిల్లర్ గా దానం
# నాగేందర్ సీరియల్

హైదరాబాద్, డిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం ఇప్పుడు క్లైమాక్స్ దశకు చేరుకుంది. ముఖ్యంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారం ఒక పొలిటికల్ థ్రిల్లర్‌ను తలపిస్తోంది. సాంకేతిక అంశాల సాకుతో కొందరు ఎమ్మెల్యేలు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నా, దానం నాగేందర్ విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఆయన తీసుకున్న నిర్ణయం,



ఇప్పుడు ఆయన చేస్తున్న వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల ఐదుగురు ఎమ్మెల్యేల విషయంలో ఇచ్చిన రూలింగ్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. వారు పార్టీ మారలేదని స్పీకర్ తేల్చిచెప్పినప్పటికీ, మిగిలిన ఐదుగురు ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటన్నది ఉత్కంఠ రేపుతోంది. ఇందులో అందరి దృష్టి దానం నాగేందర్‌పైనే ఉంది. ఎందుకంటే ఆయన కేవలం పార్టీ కండువా కప్పుకోవడమే కాదు, ఏకంగా కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఇది రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం అనర్హత వేటుకు తిరుగులేని సాక్ష్యం.బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్, కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేశారు. ఒక పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా ఉండి, మరో పార్టీ తరపున ఎన్నికల్లో పోటీ చేయడం అనేది ఫిరాయింపుల నిరోధక చట్టం కింద నేరుగా అనర్హతకు దారితీస్తుంది. స్పీకర్ నుంచి నోటీసులు అందినప్పటికీ దానం ఇప్పటివరకు వివరణ ఇవ్వకపోవడం గమనార్హం.అయితే, తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచాయి. "నేను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాను.. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్–ఎంఐఎం కలిసి 300 డివిజన్లలో గెలుస్తాయి" అని ఆయన ప్రకటించడం ద్వారా తన రాజకీయ గమ్యంపై స్పష్టత ఇచ్చేశారు. అంటే స్పీకర్ తనపై నిర్ణయం తీసుకునే వరకు వేచి చూడకుండా, తానే ఒక అడుగు ముందుకేయాలని దానం భావిస్తున్నట్లు కనిపిస్తోంది.దానం నాగేందర్ ఇప్పుడు రాజీనామా అస్త్రాన్ని ప్రయోగించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. స్పీకర్ అనర్హత వేటు వేస్తే, భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అలా కాకుండా, ముందే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే.. ప్రజల్లోకి నైతికతతో వెళ్ళినట్లు ఉంటుంది. ఉప ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ గుర్తుపై పోటీ చేసేందుకు అర్హత లభిస్తుంది. కోర్టు కేసులు, అనర్హత వేటు ముప్పు నుంచి శాశ్వతంగా బయటపడవచ్చు.దానం నాగేందర్ కేవలం ఖైరతాబాద్‌కే పరిమితం కాకుండా, గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా తన పట్టు నిలుపుకోవాలని చూస్తున్నారు. 300 డివిజన్లలో ప్రచారం చేస్తానని ప్రకటించడం ద్వారా, తాను కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఎదగాలని కోరుకుంటున్నట్లు అర్థమవుతోంది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడం ద్వారా తన ప్రాధాన్యతను నిరూపించుకోవాలని ఆయన ప్లాన్. ఒకవేళ దానం నాగేందర్ రాజీనామా చేసి ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక వస్తే, అది తెలంగాణ రాజకీయాల్లో ఒక టర్నింగ్ పాయింట్ అవుతుంది. అధికార కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని నిరూపించుకోవడానికి ఇది ఒక పరీక్ష.దానం నాగేందర్ వ్యవహారం ఇప్పుడు కేవలం ఒక ఎమ్మెల్యే అనర్హతకు సంబంధించిన అంశం కాదు. ఇది తెలంగాణలో రాబోయే రాజకీయ సమీకరణాలకు దిక్సూచి. స్పీకర్ నిర్ణయం కంటే ముందే ఆయన రాజీనామా చేసి ఎన్నికల బరిలోకి దిగితే, అది రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనమే అవుతుంది. దానం తీసుకునే ఈ బోల్డ్ స్టెప్ సక్సెస్ అయితే, మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కూడా అది ఒక మార్గదర్శకంగా మారే అవకాశం ఉంది.

# లిక్కర్ అమ్మకాలు అర్ధరాత్రి వరకు ఓ పెన్?

హైదరాబాద్,డిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

న్యూ ఇయర్ వేళ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మద్యం విక్రయదారులు, వినియోగదారులకు ఊరటనిచ్చేలా?.డిసెంబర్ 31వ తేదీన మద్యం విక్రయాల వేళలను పొడిగించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేక జీవోను జారీ చేసింది.ఎక్సైజ్ శాఖ ఉత్తర్వుల ప్రకారం?. రాష్ట్రంలోని అన్ని వైన్ షాపులు డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి 12:00 గంటల వరకు తెరిచి ఉంటాయి. ఇక బార్లు, క్లబ్బులు , టూరిజం ప్రాంతాల్లోని హోటళ్లు, అలాగే ప్రత్యేకంగా అనుమతి పొందిన ఈవెంట్ నిర్వాహకులకు రాత్రి ఒంటి గంట వరకు పని చేయడానికి అనుమతి ఉంటుంది.మరోవైపు న్యూ ఇయర్ వేళ హద్దుదాటి ప్రవర్తించే వారిపై పోలీస్ శాఖ నిఘా పెట్టనుంది. డిసెంబర్ 27వ తేదీ నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ కూడా ప్రత్యేక తనిఖీలు , డ్రైవ్స్ చేపట్టనుంది. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుండి అక్రమంగా వచ్చే మద్యం , నిషేధిత మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా ఎక్కడిక్కడ సోదాలు చేపట్టనుంది. ముఖ్యంగా డిసెంబర్ 30 , 31 తేదీలలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది. సిటీలోనే కాకుండా? చెక్ పోస్టుల వద్ద కూడా నిఘా పెంచనుంది.ఇక నూతన సంవత్సర వేడుకల పేరుతో రోడ్లపై హంగామా సృష్టిస్తూ, హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ పోలీసులు హెచ్చరించారు. తాగి వాహనాలు నడిపే వారిపై బుధవారం నుంచి న్యూ ఇయర్ రోజు వరకు నగరవ్యాప్తంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు నగర సీపీ సజ్జనార్ వివరాలను వెల్లడించారుక్రిస్మస్, వైకుంఠ ఏకాదశి, నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. హాట్ స్పాట్లు, గతంలో నేరాలు జరిగిన ప్రాంతాల్లో సిబ్బందిని మోహరించాలని, పాత నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు.డిసెంబరు 31 రాత్రి నగరవ్యాప్తంగా 100 ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని సీపీ తెలిపారు. ఇందుకోసం 7 ప్లాటూన్ల అదనపు బలగాలను రంగంలోకి దించుతున్నామన్నారు. కొత్త సంవత్సరం జోష్‌లో మోతాదు మించి తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడితే వాహన సీజ్‌తో పాటు రూ.10 వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

========================

# ఎక్కడ నుంచైనా ఔటర్ కు...

హైదరాబాద్, డిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

హైదరాబాద్ నగరవాసుల ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు హెచ్ఎండీఏ సరికొత్త ఎలివేటెడ్ కారిడార్లను ప్రతిపాదించింది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 నుండి గచ్చిబౌలి శిల్పా లేఅవుట్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు వరకు పది కిలోమీటర్ల మేర ఆరు వరుసల ఎక్స్‌ప్రెస్ వే నిర్మించనున్నారు. అలాగే, షేక్‌పేట్ నాలా నుండి గండిపేట సీబీఐటీ వరకు 200 అడుగుల రహదారి విస్తరణతో పాటు భవిష్యత్తులో ఎలివేటెడ్ కారిడార్‌ను డిజైన్ చేస్తున్నారు. ఇప్పటికే ప్యారడైజ్ నుండి శామీర్‌పేట వరకు 18.5 కిలోమీటర్ల కారిడార్ పనులు ఖరారయ్యాయి. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నగరం నడిబొడ్డు నుండి ఔటర్ రింగ్ రోడ్డుకు సిగ్నల్ లేకుండా అతి తక్కువ సమయంలో చేరుకోవచ్చు. హైదరాబాద్ నగరం శరవేగంగా విస్తరిస్తున్న తరుణంలో.. కోర్ సిటీ నుండి ఔటర్ రింగ్ రోడ్డుకు చేరుకోవడం వాహనదారులకు పెద్ద సవాలుగా మారింది. ప్రస్తుతం ఉన్న రహదారులు పెరుగుతున్న వాహనాల రద్దీని తట్టుకోలేకపోతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ భారీ ఎలివేటెడ్ కారిడార్లు , ఎక్స్‌ప్రెస్ వేల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నగరం నడిబొడ్డు నుండి ఐటీ కారిడార్‌కు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రభుత్వం ఒక ప్రతిష్టాత్మక ప్రాజెక్టును సిద్ధం చేసింది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 నుండి గచ్చిబౌలి శిల్పా లేఅవుట్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్డుకు వెళ్లేలా ఆరు వరుసల ఎక్స్‌ప్రెస్ వే నిర్మించనున్నారు. ఈ రహదారి ఫిలింనగర్, జడ్జెస్ కాలనీ, దుర్గం చెరువు పక్క నుండి టి-హబ్ మీదుగా సాగుతుంది. సుమారు 10 కిలోమీటర్ల పొడవుండే ఈ మార్గంలో 7 కిలోమీటర్ల మేర అత్యాధునిక స్టీల్ బ్రిడ్జి నిర్మిస్తారు. ఎక్కడా సిగ్నల్ లేకుండా నేరుగా ఔటర్ చేరుకునేలా దీనిని రూపొందిస్తున్నారు. మెహదీపట్నం, టోలిచౌకి నుండి గండిపేట వైపు వెళ్లే వాహనాల కోసం ప్రత్యామ్నాయ మార్గాన్ని అభివృద్ధి చేస్తున్నారు. షేక్‌పేట్ నాలా నుండి మణికొండ పైప్‌లైన్ రోడ్డు మీదుగా గండిపేటలోని సీబీఐటీ కాలేజీ వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును 200 అడుగులకు విస్తరించనున్నారు. ఈ వెడల్పైన రహదారిపై భవిష్యత్తులో 7 కిలోమీటర్ల పొడవైన ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేలా డిజైన్ చేస్తున్నారు. ఇది పూర్తయితే పాత ముంబై హైవేపై ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది. సికింద్రాబాద్ ప్యారడైజ్ నుండి శామీర్‌పేట ఔటర్ జంక్షన్ వరకు 18.5 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. సుమారు 2,232 కోట్ల రూపాయలతో చేపట్టే ఈ ప్రాజెక్టులో 11.65 కిలోమీటర్ల ఆరు వరుసల ఫ్లైఓవర్ ఉంటుంది. హకీంపేట వద్ద భూగర్భ టన్నెల్ నిర్మాణం ఈ ప్రాజెక్టులో మరో ప్రత్యేకత. ఈ కారిడార్ పూర్తయితే కరీంనగర్, నిజామాబాద్, సిద్దిపేట వైపు నుండి వచ్చే వాహనాలు నగరం లోపలికి వేగంగా రావచ్చు. దీనిని 24 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. హైదరాబాద్‌లో ఈ ఎలివేటెడ్ కారిడార్లు ప్రయాణ సమయాన్ని తగ్గించడమే కాకుండా.. నగర ఆర్థిక వ్యవస్థపై కూడా సానుకూల ప్రభావం చూపుతాయి. గచ్చిబౌలి, కొండాపూర్ వంటి ప్రాంతాల్లో పని చేసే లక్షలాది మంది ఉద్యోగులకు ఈ కొత్త కనెక్టివిటీ రోడ్లు గొప్ప ఉపశమనాన్ని ఇస్తాయి. ట్రాఫిక్ జాంలు తగ్గడం వల్ల ఇంధన వినియోగం తగ్గి.. నగరంలో వాయు కాలుష్యం తగ్గుముఖం పడుతుంది. మణికొండ, గండిపేట, శామీర్‌పేట పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటం వల్ల ఆయా ప్రాంతాల్లో నివాస గృహాలకు డిమాండ్ పెరుగుతుంది. మెట్రో రైలు, ఈ కొత్త ఎలివేటెడ్ కారిడార్ల మధ్య అనుసంధానం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నగరం నలుమూలల నుండి ఔటర్ రింగ్ రోడ్డుకు గ్రీన్ ఛానెల్ కనెక్టివిటీని ఏర్పాటు చేయడం ద్వారా హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలున్న నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం.

# మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా హైదరాబాద్

హైదరాబాద్, డిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పాలనాపరమైన సంస్కరణలకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. డివిజన్ల పునర్విభజన ప్రక్రియ దాదాపు ముగింపు దశకు చేరుకోవడంతో.. క్షేత్రస్థాయిలో పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు జోన్లు, సర్కిళ్ల సంఖ్యను భారీగా పెంచాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ నిర్ణయించారు. ఈ ప్రతిపాదిత ప్రణాళికపై రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడమే తరువాయి.. వారం రోజుల్లో కొత్త సర్కిళ్లు, జోన్ల హద్దులను ఖరారు చేస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

గతంలో 650 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న జీహెచ్ఎంసీ.. ఇటీవల 27 శివారు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల విలీనంతో ఏకంగా 2,053 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. ప్రస్తుతం ఆరు జోన్లు, 30 సర్కిళ్ల ద్వారా సాగుతున్న పరిపాలన ఇంత భారీ విస్తీర్ణానికి సరిపోవడం లేదని అధికారులు గుర్తించారు. ముఖ్యంగా ఎల్బీనగర్ జోనల్ కార్యాలయం నుంచి పెద్దఅంబర్‌పేట్ వంటి సుదూర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, వీధిలైట్లు, రహదారుల పనులను పర్యవేక్షించడం జోనల్ కమిషనర్లకు సవాలుగా మారింది. ఈ సమస్యను అధిగమించడానికి ప్రస్తుతమున్న 6 జోన్లను 12కు, 30 సర్కిళ్లను 60కి పెంచాలని నిర్ణయించారు. దీనివల్ల ప్రతి జోన్ పరిధిలో సగటున ఐదు సర్కిళ్లు ఉండి, పర్యవేక్షణ మరింత సులభతరం కానుంది. వచ్చే ఏడాది జనవరి నుంచి దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియ ప్రారంభం కానుంది. ఒకసారి జనగణన మొదలైతే, తదుపరి రెండేళ్ల వరకు డివిజన్ల మార్పులు లేదా పునర్విభజన చేపట్టడం సాధ్యపడదు. ఈ సాంకేతిక ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని.. ప్రభుత్వం అత్యంత వేగంగా శివారు ప్రాంతాల విలీనాన్ని పూర్తి చేసి పునర్విభజన ప్రక్రియను కొలిక్కి తెచ్చింది. ఈ వ్యవస్థీకరణ కేవలం సౌలభ్యం కోసం మాత్రమే కాకుండా.. భవిష్యత్తులో జీహెచ్ఎంసీని మూడు స్వతంత్ర మహానగరపాలక సంస్థలుగా విభజించాలనే ప్రభుత్వ దీర్ఘకాలిక వ్యూహానికి పునాదిగా కనిపిస్తోంది. ప్రభుత్వ ప్రాథమిక ఆలోచన ప్రకారం.. మూసీ నదిని సరిహద్దుగా తీసుకుని నగర విభజన జరగనుంది. మూసీకి దక్షిణాన ఉన్న ప్రాంతాలన్నింటినీ కలిపి ఒక కార్పొరేషన్‌గా దీనికి 'జీహెచ్ఎంసీ' పేరునే కొనసాగించే అవకాశం ఉంది. ఉత్తరాన ఉన్న ప్రాంతాలను సికింద్రాబాద్, సైబరాబాద్ పేరుతో మరో రెండు కార్పొరేషన్లుగా ఏర్పాటు చేసే దిశగా కసరత్తు సాగుతోంది. ఈ చారిత్రాత్మక మార్పు ద్వారా నగరంలోని అన్ని ప్రాంతాలకు సమానంగా నిధులు కేటాయించడం, ట్రాఫిక్, వ్యర్థాల నిర్వహణ వంటి సమస్యలను స్థానికంగానే పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం. ఈ పునర్ వ్యవస్థీకరణ పూర్తయితే.. హైదరాబాద్ మహానగరం పాలనాపరంగా సరికొత్త రూపురేఖలను సంతరించుకోనుంది.

# మామూళ్ల మత్తులో మైనింగ్, రెవెన్యూ శాఖలు!

మహబూబ్ నగర్,డిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేరుతో తన అనుచర వర్గం పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో మట్టి దందాకు తెర లేపుతోంది. అధికార పార్టీ మాదే మంత్రి మావాడే నంటూ పగలు రాత్రి అని తేడా లేకుండా ప్రభుత్వ భూములు, గుట్టలను ధ్వంసం చేస్తూ అడ్డగోలుగా భారీ హిటాచీలతో గోతులు తీసి టిప్పర్ల ద్వారా మట్టి సరఫరా చేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కోట్లు వెనకేసుకుంటున్నారు. రాత్రుళ్ళు టిప్పర్లు, పగలు ట్రాక్టర్లు రోడ్ల నిండా హంగామా చేస్తున్నాయి. అడిగిన అధికారులకు మంత్రి మావాడే అంటూ జవాబిస్తూ జాతీయ రహదారి నిర్మాణ పనులు, ఇందిరమ్మ ఇళ్ళ పేరుతో తమకు నచ్చినట్లు మట్టిని తరలిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారం ఇతరులకు మట్టిని అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం మైనింగ్ రెవెన్యూ శాఖ అధికారుల అనుమతి తీసుకోవాలి కానీ అధికార పార్టీ అండ దండ పుష్కలంగా ఉందంటూ కొంతమంది మండల, జిల్లా స్థాయి అధికారులతో లోపాయికారి ఒప్పందాలు చేసుకొని కాంగ్రెస్ ఖద్దరు నేతలు పగలు రాత్రి అని తేడా లేకుండా మట్టి తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దగ్గర్లోని ఇతర రైతుల పంట పొలాల గుండా అక్రమంగా ప్రయాణిస్తూ ప్రశ్నించిన వారిని టిప్పర్ తో తొక్కిస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతూ తమ వెనకాల మంత్రి అండదండలు ఉన్నాయంటూ ఇతర పార్టీ లీడర్లను కూడా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మధ్య జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ పోటీ చేసి అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థి గోరంగా పరాజయం పాలైనట్లు అందుకు ప్రధాన కారణం అక్రమ మట్టి తరలింపు, అహంకారం, దౌర్జన్యాలేనని బాహాటంగా చర్చించుకుంటున్నారు. అయినప్పటికీ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఇలాంటివారిని ప్రోత్సహిస్తున్నారా అని సామాన్యులు ముక్కున వేలేసుకుంటున్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని ప్రభుత్వ భూములు, గుట్టలు ధ్వంసం అవుతున్న సంబంధిత మండలాల రెవెన్యూ అధికారులు జిల్లా మైనింగ్ శాఖ అధికారులు పోలీసు అధికారులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం వెనక అవినీతి ముడుపుల మతలబు ఉందని చర్చ జరుగుతుంది. తెలకపల్లి మండలం రామగిరి గుట్టలు, తూడుకుర్తి గ్రామంలోని ఎర్రగుట్టలు, గన్యాకుల గ్రామంలోని గుట్టలు, పెద్దకొత్తపల్లి మండల పరిసరాల్లోని కుమ్మరి గుట్టలు, కోడేర్ ఇతర ప్రాంతాల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన భారీ కొండలను సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధ్వంసం చేసి మట్టి దందాకు తెర లేపారు. నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు ఒక్కో ప్రాంతంలో గుట్టలను తవ్వుకోవడం కోసం తెర వెనక ధర నిర్ణయించి భారీ మొత్తంలో ముడుపులు అందుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా ప్రాంతావాసులు తరచూ రెవెన్యూ పోలీస్ మైనింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదులు అందినా పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమంగా ఇసుక తరలించడం కోసం రెవెన్యూ మైనింగ్ శాఖ అధికారులు ఇతర ప్రైవేటు వ్యక్తుల చేత అద్దె పద్ధతిన టిప్పర్లను కూడా ఏర్పాటు చేసుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే ఒక సామాన్యుడు ట్రాక్టర్ మట్టి తీసేందుకు ప్రయత్నించినా వెంటనే వాలిపోయే రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖ అధికారులు భారీ స్థాయిలో హిటాచిలతో పెద్ద మొత్తంలో గోతులు తీసినా ఎందుకు స్పందించడం లేదో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగులుతోంది. మట్టి మాఫియా చెప్తున్నట్లుగా ఇందుకు నిజంగానే మంత్రి అండగా నిలిచాడా అన్న అనుమానాలు లేకపోలేదు. బిఆర్ఎస్ నేతల అవినీతి అక్రమాలు ఆగడాలను విసిగి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపిన ప్రజలకు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలోని ముఖ్యమైన నేతల అనుచరులు చేస్తున్న అరాచకాలు భంగపాటుకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి మట్టి దందాల కారణంగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడటంతో పాటు వాతావరణ సమతుల్యత దెబ్బతిని భారీ వృక్షాలు నేలకూలి ఇతర జీవరాసులు కూడా మృత్యువాత పడే ప్రమాదం లేకపోలేదని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన ఆయా గ్రామ పంచాయతీలు పరిపాలన పగ్గాలు చేతబట్టిన నేపథ్యంలో ఇప్పటికైనా ఈ అక్రమాలకు కళ్లెం పడుతుందా వేచి చూడాలి.

# కీ రోల్ కానున్న పెన్ డ్రైవ్

హైదరాబాద్, డిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు అనూహ్య మలుపు తిరిగింది. ఇన్నాళ్లూ విచారణ, అరెస్టుల చుట్టూ తిరిగిన ఈ కేసు దర్యాప్తు ఇప్పుడు ఒక పెన్‌డ్రైవ్ కేంద్రంగా మారింది. అందులో నిక్షిప్తమైన సమాచారం బీఆర్ఎస్ అగ్రనాయకత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు వద్ద లభించిన ఈ పెన్‌డ్రైవ్‌లో ట్యాపింగ్‌కు సంబంధించిన పక్కా ఆధారాలు ఉన్నాయని సిట్ భావిస్తోంది. ఈ సాక్ష్యాల ఆధారంగానే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులకు నోటీసులు జారీ చేసేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు విస్తృత ప్రచారం జరుగుతోంది. ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న సమయంలో ప్రభాకర్ రావు అత్యంత రహస్యంగా సేకరించిన సమాచారాన్ని ఈ పెన్‌డ్రైవ్‌లో భద్రపరిచినట్లు సిట్ గుర్తించింది. ఇందులో ఉన్న వివరాలు చూసి అధికారులే విస్తుపోతున్నారు. కేవలం ఫోన్ నంబర్లు మాత్రమే కాకుండా.. హైకోర్టు జడ్జీలు, ప్రముఖ జర్నలిస్టులు, కీలక రాజకీయ నాయకులు, బడా వ్యాపారవేత్తల పూర్తి ప్రొఫైల్స్ ఇందులో ఉన్నట్లు సమాచారం. వందల సంఖ్యలో ట్యాప్ చేసిన ఫోన్ నంబర్లు, వారి వ్యక్తిగత సమాచారం ఇందులో నిక్షిప్తమై ఉంది. ప్రస్తుతం సిట్ కస్టడీలో ఉన్న మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావును ఈ పెన్‌డ్రైవ్ ఆధారంగానే అధికారులు ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. ఎల్లుండి వరకు ఆయన్ను విచారించనున్న నేపథ్యంలో.. ఈ పెన్‌డ్రైవ్‌లోని డేటాను ఎవరి ఆదేశాల మేరకు సేకరించారు.? ఎవరికి చేరవేశారు.? అన్న కోణంలో లోతుగా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను , మరో మాజీ ఎస్ఐబీ చీఫ్‌ను విచారించిన సిట్.. ఇప్పుడు ప్రభాకర్ రావు ఇచ్చే సమాచారంతో కేసుకు ముగింపు పలికే దిశగా వెళ్తోంది. అసలు ఈ ట్యాపింగ్ పర్వం ఎవరి ప్రయోజనాల కోసం జరిగింది.? అన్నదే ఇప్పుడు సిట్ ముందున్న ప్రధాన ప్రశ్న. ప్రభుత్వంలోని పెద్దల ఆదేశాలు లేనిదే ఇంతటి భారీ నిఘా యంత్రాంగం నడవడం అసాధ్యమని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుల పాత్రపై అనుమానాలు బలపడుతున్నాయి. పెన్‌డ్రైవ్‌లో ఉన్న సమాచారం కను క నేరుగా రాజకీయ పెద్దలకు లింక్ అయితే, వారికి నోటీసులు ఇవ్వడం ఖాయమని పోలీసు వర్గాల టాక్. ఈ పెన్ డ్రైవ్ వ్యవహారం బయటకు రావడంతో.. అందులో ఎవరెవరి పేర్లు ఉ న్నాయన్నది ఇప్పుడు రాజకీయ, మీడి యా, న్యాయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ట్యాపింగ్ కేసులో ఇన్నాళ్లూ దొరకని కీలక లింక్ ఈ పెన్ డ్రైవ్ రూపంలో దొరికిందని, ఇదే ఈ కేసులో గేమ్ ఛేంజర్ కాబోతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. త్వరలోనే ఈ కేసులో మరిన్ని సంచలన అరెస్టులు లేదా నోటీసులు వెలువడే అవకాశం ఉంది.






# పేద క్రైస్తవ కుటుంబాలకు రైస్ బ్యాగ్ లు పంపిణి...

### ప్రపంచ శాంతి, ప్రేమ కు ఏసుక్రీస్తు భోదనలు ఆదర్శం: విహెచ్ఆర్

**క్రైస్తవ కుటుంబాలు అంటే కెసిఆర్ కు అమితమైన ప్రేమ...**

**రామగుండం ప్రజలు అబద్రతలో ఉన్నారు. ప్రజలు సంఘటితమైతేనే రౌడీ పాలన అంతమైతది. కాలుష్యం అంతం...**

**సుభీక్ష రామగుండం నాలక్ష్యం: వ్యాల్ల హరీష్ రెడ్డి**

గోదావరిఖని: క్రిస్మస్ డే సందర్భంగా గోదావరిఖని లోని కల్వరి సువార్త సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, విహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వేళ్ళ హరీష్ రెడ్డి పాల్గొని క్రైస్తవ కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఫాస్టర్ జీవరత్నం తో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. 30మంది పేద క్రైస్తవ కుటుంబాలకు 25కిలోల రైస్ బ్యాగ్ లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ.. క్రైస్తవ సోదరులు అంటే కెసిఆర్ గారికి అమితమైన ప్రేమ అని అన్నారు కెసిఆర్ పాలనలో క్రైస్తవ కుటుంబాలకు క్రిస్మస్ సందర్భంగా ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారని గుర్తు చేశారు. ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచ మానవాలికి శాంతి, ప్రేమా, సేవాగుణం నేర్పించాయని పేర్కొన్నారు. రామగుండం ప్రజలు అభద్రతా భావంతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇక్కడ ప్రజాస్వామ్యం లేదని, అధికారులు, పోలీసులు ఎమ్మెల్యే ఆదేశాలు పాటిస్తున్నారని అన్నారు. పేద ప్రజల ఇండ్లు కూల్చడమే ప్రజా పాలననా అని ప్రశ్నించారు. ప్రజలు సంఘటితమైతే రౌడీ పాలన అంతమవుతుందని సూచించారు. ప్రస్తుతం రామగుండం దేశంలో ఎక్కడా లేనివిధంగా కాలుష్య కోరల్లో చిక్కుతుందని కాలుష్యాన్ని తరిమికొట్టి ఆరోగ్య సేవ గుణం గల రామగుండం గా తీర్చిదిద్దేందుకు అందరూ ఏకతాటిపైకి రావాలని హరీష్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ ప్రాంత ప్రజల సంక్షేమం, చిరు వ్యాపారులకు నష్టం జరగకుండా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా హరీష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ అధికార ప్రతినిధి జహీద్ పాషా, పోలాడి శ్రీనివాస్ రావు, యువజన విభాగ అధికార ప్రతినిధి బూరుగు వంశీకృష్ణ, నడిపల్లి సాయి సిగిరి రాము కొండా సురేష్ పొయిల రవి కే రాములు అనిల్ అల్లి గణేష్ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ కార్మిక లోకానికి బిఎంఎస్ ఆదర్శం

## దత్తో పంత్ టెంగ్డీ బిఎంఎస్ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవంలో...

### ఆర్ఎస్ఎస్ సర్ కార్యవాహ దత్తాత్రేయ హొసబాలే

కరీంనగర్, డిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి): ప్రపంచ కార్మిక లోకం భారతీయ మజ్దూర్ సంఘ్ ఆలోచన విధానాన్ని స్వీకరించి అందుకు అనుగుణంగా ముందుకు సాగుతుండడం గర్వకారణమని ఆర్ఎస్ఎస్ సర్ కార్యవాహ మాననీయ దత్తాత్రేయ హొసబాలే అన్నారు.గురువారం స్థానిక ఆర్టీసీ కళ్యాణ మండవంలో భారతీయ మజ్దూర్ సంఘ్ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం దత్తోపంత్ టెంగ్డీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగానిర్వహించిన కార్మిక సదస్సులో ఆయన మాట్లాడుతూ,నిరంతర కృషితో సంఘ కార్యాలయ భవనాన్ని ఏర్పాటు చేసుకున్న బిఎంఎస్ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయం అంటే కార్యానికి ఆలయం లాంటిదని ఆయన అన్నారు.బిఎంఎస్ దేశహితం, కర్మగారహితం, కార్మికహితం కోసం నిరంతరం పని చేస్తున్నదనిచెప్పారు.మజ్దూర్ సంఘ్ సిద్ధాంతం విశేషమైనదని, భారతీయ మజ్దూర్ సంఘంలో అన్ని రకాల కార్మికులు ఉన్నారనివారంతా దేశ హితం కోసమే పని చేస్తారని తెలిపారు.బిఎంఎస్ సంస్థాపకుడు దత్తో పంత్ తన చైనా పర్యటనలో రాజనీతికి అతీతంగా కార్మిక సంఘాలు ఉండాలని,అవి దేశీయుతం గురించి, యాజమాన్యం కార్మికులు ఒకే కుటుంబం అనే భావనలో పని చేయాలనిసూచించిన విషయాన్ని గుర్తు చేశారు.చైనాలోని కార్మిక సంఘాలు కూడా ఆయన భావనలను స్వీకరించడానికి ముందుకు వచ్చాయన్నారు. మజ్దూర్ సంఘంలో స్వదేశీ, ఆర్థిక, పర్యావరణం కూడా ఒక భాగమని, ఇందుకు అధ్యయనం, శిక్షణ అవసరం అవుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు కార్యాలయ ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. బిఎంఎస్ నినాదం త్యాగం, తపస్సు, బలిదానం.. యాదృచ్ఛికంగా ఈరోజే అటల్ బిహారీ వాజ్ పాయ్, స్వాతంత్ర్య సమరయోధుడు మదన్ మోహన్ మాలవియా జయంతి. వీరిరువురు ఆర్థిక స్వాలంబన, స్వదేశీ విచారధార కలవారని తెలిపారు. ఈ ఇద్దరు నేతలు అత్యంత సాధారణ జీవితం గడిపారని,సమాజంలో ఉన్న బడుగు బలహీన వర్గాల కోసమే జీవితాంతం పనిచేశారని చెప్పారు.బిఎంఎస్ వ్యవస్థాపకుడు దత్తోపంత్ కార్మికుల సంక్షేమం కోసం తమ జీవితాన్ని త్యాగం చేశారని,కార్మిక ప్రపంచాన్ని ఏకం చేయడానికి నిరంతరం పాటుపడ్డారని అన్నారు.కేవలం కోర్కెల సాధన కొరకు మాత్రమే బిఎంఎస్ ఏర్పాటు కాలేదని, ఇందులోని కార్మికులు దేశ ఆర్థిక వికాసం,సంక్షేమం కొరకు పనిచేయడం అనేది సంఘ నినాదం అన్నారు.కేవలం కార్యాలయాల నిర్మాణం చేసుకుంటే మాత్రమే సరిపోదని, కార్యకర్తలు సమయం ఇచ్చి పని చేయడం ముఖ్యం అన్నారు. సమర్పణ బావం, నిస్వార్థ సేవ దిశలో బిఎంఎస్ కార్యకర్తలు అందరు నిరంతరం కార్యరంగంలో పని చేయాలన్నారు. భవనం ఎన్ని అంతస్తులు ఉన్నదనేది ముఖ్యం కాదని, సభ్యుల హృదయం సంస్థ కొరకు ఎంత విశాలంగా ఉందనేది అవసరంఅన్నారు.



సభకు రాష్ట్ర బిఎంఎస్ అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి,బండి సంజయ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ,ఆర్ఎస్ఎస్ కార్యకారిణి సదస్సులు బాగయ్య బిఎంఎస్ జాతీయ అధ్యక్షుడు హిరణమై పాండ్యా,ప్రధాన కార్యదర్శి రవీంద్ర హింతే, ఉపాధ్యక్షులు సుంకరి మల్లేశం,సంఘటన కార్యదర్శి బి.సురేంద్రన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి రామ్ రెడ్డి, పూర్వజాతీయ ప్రధాన కార్యదర్శి కే.లక్ష్మారెడ్డి,జాతీయ నాయకులు సురేంద్ర పాండే,దినేష్ మిశ్రా సాజీ నారాయణ్, రవిశంకర్ అల్లూరి, చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

# కరుణామయుడు ఏసుక్రీస్తు

## - క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సంగారెడ్డి(పటాన్చెరు) భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 25: కరుణామయుడు ఏసుక్రీస్తు బోధనలు, జీవితం ప్రతి ఒక్కరికి అనుసరనీయమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని.. పటాన్చెరు డివిజన్ పరిధిలోని మెథడిస్ట్ చర్చ్, పెంతెకోస్తూ చర్చిలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా అతి పెద్ద పండుగ క్రిస్మస్ అన్నారు. విశ్వ శాంతి దూత, దేవుని కుమారుడు భూమి మీద అడుగు పెట్టిన శుభదినం అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ పరమత సహనం, దైవ చింతన అలవాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, సీనియర్ నాయకులు వెంకటేష్, షకీల్, ఆయా చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.

# ఘనంగా క్రిస్మస్ పర్వదినం

## వేడుకల్లో పాల్గొన్న టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 25:

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి పట్టణంలోని పలు చర్చిలలో నిర్వహించిన వేడుకల్లో టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. మొదటగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ఆసుపత్రి సిబ్బంది, పేషంట్ల సమక్షంలో కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంగారెడ్డిలోని మెథడిస్ట్ చర్చ్, సిఎస్ఐ చర్చ్,రాక్ చర్చ్, హొసన్న చర్చ్, సౌందర్య సీయోను చర్చిలలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె చర్చిలలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మత పెద్దలు, పాస్టర్ లతో కలసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు.చర్చి పెద్దలు నిర్మలా జగ్గారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రేమ, శాంతి, సౌహార్ద్రతకు ప్రతీక అయిన క్రిస్మస్ పండుగను ప్రతి ఒక్కరూ ఐక్యతతో జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ జార్జ్ , క్రిస్టియన్ కోఆర్డినేటర్ మధు, నాయకులు కూన సంతోష్,చర్చి ప్రతినిధులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా రాష్ట్ర ప్రజలందరికీ క్రిస్టమస్ శుభాకాంక్షలు... డిప్యూటీ సీఎం భట్టి

ప్రపంచవ్యాప్తంగా మనుషులు ప్రేమ ఆప్యాయతతో జీవించాలి యాంకర్...మధిర నియోజకవర్గంలోని బయ్యారం చర్చిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. చారిత్రాత్మకమైన బయ్యారం చర్చి నిర్మించుకొని 125 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చర్చ్ కు చేరుకున్న సోదర సోదరీమణులందరికీ, స్నేహితులకు, రాష్ట్ర ప్రజలందరికీ క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు.ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా బయ్యారం చర్చ్ కు రావడం ఫాదర్ తో ప్రార్థనలు చేయించుకొని కేవలం మధిర నియోజకవర్గంలోని కుటుంబాలకే కాకుండా రాష్ట్రం మరియు దేశంలోని అన్ని కుటుంబాలకు శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రధానంగా మానవ మనుగడకు ప్రపంచవ్యాప్తంగా సహజీవనంతో జీవించేలా తద్వారా మానవ మనుగడకు మనం అంతా ప్రేమతో ఆప్యాయతో బతికేలా ఉండాలని ప్రతి సంవత్సరం ఈ చర్చి నుంచి ప్రభువును ప్రార్థిస్తున్నానన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ప్రభువు ఆశీర్వాదాలు ఉండాలని మంచి జరగాలని, కుటుంబాలు బాగా ఎదిగి పిల్లలు మంచిగా చదువుకొని ఎదగాలని ఫాదర్ తో ప్రార్థన చేయించుకుని ఇక్కడి నుంచి బయలుదేరుతానన్నారు. కేవలం ప్రార్థనలు చేయించుకుని బయలుదేయటమే కాదు ప్రభువు ఏ సందేశాన్ని అయితే మానవాళికి అందించారూ ఇతరుల కోసం, వారి ఇబ్బందుల నుంచి బయటపడేయడం కోసం ఎలా జీవించాలో ప్రభువు జీవితం మనకు నేర్పిస్తుంది అన్నారు.



ఒకరికి మరొకరు సహాయ సహకారాలతో జీవించేందుకు ప్రభువు ఆశీస్సులు మనందరిపై ఉండాలని ప్రభువును ప్రార్థిస్తున్నాను అన్నారు. ప్రజలందరి యోగక్షేమాల కోసం ఈ అధికారం ఉపయోగపడే విధంగా మన ఆలోచనలు మనం మార్గం ఉండేటట్టుగా ప్రభువు మనల్ని నడిపించాలని ఆ ప్రభువును కోరుకుంటున్నానని తెలిపారు. ప్రభువు చూపించిన మార్గంలో పయనిస్తూ తోటి వారి కోసం పనిచేద్దామని మరోసారి ఎంతో చారిత్రాత్మకమైన ఈ బయ్యారం చర్చి నుంచి 125 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఎంతో వైభవంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారని తెలుసుకొని ఆ వేడుకలు వైభవంగా జరగాలని ప్రపంచవ్యాప్తంగా శాంతి సందేశం వెళ్లేలా ఉత్సవాలు భారీగా ఉండాలని తాను కోరుకుంటున్నాను.బయ్యారంలో అభివృద్ధి కోసం కాకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం భగవంతుడు నిండుగా మనకు శక్తిని ఇవ్వాలని ఆయన శక్తితో వచ్చే అధికారం హోదాతో కూడా ప్రజా సంక్షేమ కోసం ఉపయోగపడేట్టుగా మన ఆలోచనలు మన మార్గాన్ని నడిపించే విధంగా వారు ఆశీర్వదిస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటూ అందరికీ రాబోయే రోజుల్లో మంచి జరగాలని ఈ క్రిస్మస్ సందర్భంగా విస్మస్ శుభాకాంక్షలు తో పాటు నూతన సంవత్సర శుభాకాంక్షలు అందరికి తెలియజేస్తున్నానన్నారు.

# 28పత్రికల్లో మీడియాలో తప్పుడు ఆరోపణలు ప్రచురించిన పత్రిక రిపోర్టర్లకు లీగల్ నోటీసులు.

## జమ్మికుంట మున్సిపాలిటీ మాజీ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వరరావు

జమ్మికుంట, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 25:

రాజకీయ పార్టీ నాయకులు కొంతమంది విలేకరులు నాపై కావాలని రాజకీయంగా నన్ను ఇబ్బందులు గురిచేయాలనే ఉద్దేశంతో నాపై, జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ధర్మారం శివారులో గల అంజన టౌన్ షిప్ పైన తప్పుడు ఆరోపణలు రాతలు రాస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఏదైనా చట్టాల ద్వారా వారికి సమాధానం చెప్తానని జమ్మికుంట మున్సిపాలిటీ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు, అన్నారు. గురువారం రోజున తన నివాసంలో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించి రాజేశ్వరావు, మాట్లాడుతూ రాజకీయంగా నన్ను ఎదుర్కొనే దమ్ము లేక కొంతమంది ఒక పత్రిక ఒక మీడియా ఛానల్ విలేకరులను ఆసరా తీసుకొని నాపై తప్పుడు రాతలు రాపిస్తున్నారని అన్నారు. అంజనా టౌన్ షిప్ పైన తప్పుడు వీడియోలు తప్పుడు రాతలు



విలేకరులకు లీగల్ నోటీసులు, జిల్లా కలెక్టర్ లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాల నుండి అనేక రకాలుగా నన్ను ఇబ్బందులు గురిచేస్తూ అంజన టౌన్ షిప్ పై ఎంతోమంది ఫిర్యాదులు చేశారని ప్రభుత్వాధికారులు వచ్చి ఎలాంటి ప్రభుత్వ భూమి అంజనా టౌన్ షిప్ లో లేదని నిర్ధారించిన కానీ కొంతమంది అందులో ఇల్లు కట్టుకొని నివసిస్తున్న ప్రజలను నన్ను రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని ఉద్దేశంతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. గత మూడు సంవత్సరాల క్రితం అంజన టౌన్ షిప్ లేఔట్ ప్రారంభించినప్పుడు అన్ని రకాలుగా ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకున్న తర్వాతనే అందులో క్రయవిక్రయాలను ప్రారంభించామని అప్పటినుండి ప్రభుత్వం ఏ విధంగా అయితే లేఅవుట్ పర్మిషన్ ఇవ్వడానికి ఎలాంటి అర్హతలు ఉండాలో అన్ని పత్రాలు సంబంధిత అధికారులకు సమర్పించిన తర్వాతనే ప్రారంభించామని రాజేశ్వర్ రావు, తెలిపారు. ఒక మీడియా ఛానల్ ఒక పత్రిక రిపోర్టర్ ను అడ్డుపెట్టుకొని నా పైన తప్పుడు రాతలు రాస్తే సహించేది లేదని రాజేశ్వరరావు విలేకరుల సమక్షంలో హెచ్చరించారు.

# ఢిల్లీ పర్యటనలో మానకొండూరు జడ్పీ విద్యార్థులు

## భోజన, వసతి,రవాణా సౌకర్యం కల్పించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్, డిసెంబర్,25 (భార్వతశక్తి ప్రతినిధి):

నాలుగు రోజుల విహారయాత్రకు గాను మానకొండూర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులు ఢిల్లీ చేరుకున్నారు. తొలిరోజు ఇండియా గేట్, ఎర్రకోట, అక్షర ధామ్ ను వారు సందర్శించారు. విద్యార్థులుఢిల్లీ,మథుర,ఆగ్రాలలో విహార యాత్ర పూర్తి చేసుకుని తిరిగి రానున్నారు. వీరందరికీ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తన అధికారిక నివాసంలో భోజన,వసతి సౌకర్యం కల్పించారు. ప్రత్యేకంగా రవాణ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. తొలిరోజు ఆయా విద్యార్థులంతా ఢిల్లీలోని ఇండియా గేట్, నేషనల్ పోలీస్ మెమోరియల్, ఎర్రకోట, రాజ్ ఘాట్, బిర్లా మందిర్, అక్షర్ ధామ్ ఆలయం, నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్, సెంట్రల్ సెక్రటేరియట్లను సందర్శించారు. శుక్రవారం పార్లమెంట్, ప్రధానమంత్రుల సంగ్రహాలయం (పీఎం సంగ్రహాలయం)ను సందర్శించనున్నారు. అనంతరం హుమాయున్ సమాధి, సఫ్దర్‌జంగ్ సమాధి, పురానా ఖిల్లా, కుతుబ్ మినార్ వంటి ప్రముఖ చారిత్రక కట్టడాలను వీక్షించి దేశ చరిత్ర, శిల్పకళపై అవగాహన పెంచుకోనున్నారు. ఈనెల 27న మథురలోని శ్రీ కృష్ణ జన్మస్థలాన్ని సందర్శించి అనంతరం ఆగ్రాలో పర్యటిస్తారు. అదే రోజు సాయంత్రం దక్షిణ్ ఎక్స్‌ప్రెస్



ద్వారా జమ్మికుంటకు తిరుగు ప్రయాణం అవుతారు. జాతీయ స్థాయి సంస్థలు, చారిత్రక కట్టడాలు,దేశ సాంస్కృతిక వారసత్వంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో మానకొండూరు ఉన్నత పాఠశాల అధ్యాపకులు ఈ పర్యటనను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఢిల్లీ చేరుకున్నప్పటి నుండి వివిధ ప్రాంతాల సందర్శన పూర్తయ్యే వరకు అవసరమైన భోజన, వసతి, రవాణా సౌకర్యాలను కేంద్ర మంత్రి బండి సంజయ్ కల్పిస్తున్నారు.

# అయిదు తరాల అపురూప సమ్మేళనం ఒక్క వేదికపైకి చేరిన 200 మంది

## మంథని కొంతం కిష్టయ్య కుటుంబ వారసులు ఆదర్శం



కరీంనగర్, డిసెంబర్, 25(భారతశక్తి ప్రతినిధి):

ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయి విలువలు ప్రశ్నార్థకమవుతున్న ప్రస్తుత

తరుణంలో ఇదొక అపురూప సన్నివేశం. ఒకే కుటుంబానికి చెందిన దాదాపు 200 మంది ఒక వేదికపై కలుసుకుని ఆనందానుభూతిని పొందిన సందర్భమిది. పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన కొంతం కిష్టయ్య, అమ్మాయి దంపతుల వారసులు గురువారం హైదరాబాద్ కొండాపూర్ లోని అపర్ణా సెరేన్ కమ్యూనిటీ లో కలుసుకున్నారు. 80 ఏళ్ల వృద్ధులు మొదలుకొని ఆరు నెలల శిశువుల వరకు అయిదు తరాల వారు ఇందులో పాలు పంచుకున్నారు.

సామాన్య నేపథ్యం నుంచి మొదలైన ఒక కుటుంబం, కేవలం చదువునే ఆయుధంగా మలుచుకుని ఐదు తరాల సంబరాన్ని జరుపుకోవడం అందరినీ ఆకట్టుకుంటోంది. ఒకప్పుడు ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్న ఈ కుటుంబం, నేడు సమాజంలో పదిమందిని నడిపించే నాయకత్వ స్థానాలకు ఎదగడం విశేషం. ఈ అపురూప కలయికలో నాటి కష్టాలను తలుచుకుంటూ, నేటి విజయాలను చూసి ఆ కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోనయ్యారు. తమ మూలాలను మరువకుండా, విద్య ద్వారా తలరాతను మార్చుకోవచ్చని నిరూపించిన ఈ ఐదు తరాల ప్రయాణం నేటి సమాజానికి ఒక గొప్ప స్ఫూర్తి. పెద్దల ఆశీస్సులు, పిల్లల ప్రగతి కలగలిసిన ఈ వేడుక ఒక అద్భుత దృశ్యంగా నిలిచింది.

ఈ సందర్భంగా కుటుంబ వృక్షాన్ని చిత్రరూపకంగా ప్రదర్శించారు. తర్వాత ప్రతి కుటుంబానికి చెందిన వారు పరిచయం చేసుకున్నారు. ఆటపాటలు, చిన్నారుల కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మంథని ఫ్యామిలీ గ్రూప్ వాట్సాప్ బృందం ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసి విజయవంతం చేసింది. రాష్ట్రంలోని అనేక జిల్లాల నుంచి అనేక వ్యయ ప్రయాసలకోర్చి, చలిని కూడా లెక్క చేయకుండా అంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. కుటుంబ పెద్దల విలువలు, సభ్యులందరి ఫొటోలు, పరిచయాలతో ప్రత్యేక పుస్తకాన్ని ప్రచురించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. విదేశాల్లో ఉంటున్న కుటుంబ సభ్యులు ఆన్లైన్ లో పాల్గొన్నారు. ఇలాంటి వేడుకలు ప్రస్తుతం అత్యంత అవసరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు.

# ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్ల పట్టివేత






కరీంనగర్, డిసెంబర్ 25 (భారతశక్తి ప్రతినిధి):కరీంనగర్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన సుదగోని భరద్వాజ్ తండ్రి నర్సయ్య అనునతడు అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తుండగా చామనపల్లి గ్రామ శివారు వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు, అలాగే బొమ్మకల్ గ్రామానికి చెందిన పోగుల సాయిచంద్ తండ్రి ఆంజనేయులు అనునతడు అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా బొమ్మకల్ గ్రామం లోని లారీ అసోసియేషన్ వద్ద రూరల్ పోలీసులు పట్టుకున్నారు నిందితులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్ ను సీజ్ చేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# ఏఈఓల జిల్లా సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

## ఐక్య పోరాటమే సమస్యల పరిష్కారం

## టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దారం



కరీంనగర్, డిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):

కరీంనగర్ జిల్లా వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈఓ) సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. ఎన్నికల అధికారులుగా హరికృష్ణ శ్రీనివాస్ గౌడ్ లు వ్యవహరించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఎన్జీవో సంఘం అనుబంధ సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగేలా కృషి చేస్తుందని తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, "సేవకులే నాయకులవుతారనీ చెప్పారు. నాయకుడి కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేదు. బాధ్యత తీసుకుని పనిచేస్తే మనమే నాయకులమవుతాం" అని పిలుపునిచ్చారు. సంఘం అంటే సమిష్టి కలయిక అని, ఐక్యంగా ఉంటేనే ఉద్యోగుల సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యోగులు యస్మా, రాజద్రోహం వంటి కేసులను లెక్కచేయకుండా సకలజనుల సమ్మెలో పాల్గొన్నారని గుర్తు చేశారు. రాష్ట్రం వచ్చిన తరువాత కూడా పీఆర్సీ, డీఏలు లేకపోవడం, రిటైర్ ఉద్యోగులకు హెల్త్ కార్డులు, దాచుకున్న డబ్బుల కోసం ధర్నాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలన్నింటి పరిష్కారానికి ఉద్యోగులందరి ఐక్య పోరాటమే మార్గం అని, సంఘాన్ని విమర్శించడం కాదు సంఘం కోసం మనం ఏం చేస్తున్నామన్న బాధ్యతతో ముందుకు రావాలి అని సూచించారూ ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంఘం లక్ష్మణరావు, కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి పూర్ణచందర్ రెడ్డి సత్యం సతీష్ శ్రీనివాస్ రాకేష్ ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఏ ఈ ఓ ల సంఘం జిల్లా కమిటి

జిల్లా అధ్యక్షులుగా రంగు రవికుమార్ కార్యదర్శిగా వెంకటస్వామి, కోశాధికారిగా శ్రావణ్ కుమార్, సహా అధ్యక్షులుగా ఉదయ్ కుమార్, మహేందర్, సాయికుమార్, సుచరిత, ఉపాధ్యక్షులుగా రాజు, నిఖిల్, సాయి ప్రసన్న, రాజశేఖర్, అనంతరాజు, రాకేష్, రాంప్రసాద్, శిరీష లు ఎన్నికయ్యారు.

# కోట పబ్లిక్ స్కూల్లో ఘనంగా క్రిస్మస్ సంబరాలు

## మానవత్వం సోదర భావనమే క్రిస్మస్

### కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి

కరీంనగర్, డిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొనికోట పబ్లిక్ స్కూల్ కేంద్ర కార్యాలయంలో క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ లోని రేకుర్తి లోగల కోట పబ్లిక్ స్కూల్ లో పర్వదినాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వేడుకలను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కోట పబ్లిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ డి. అంజిరెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, కరుణ, సేవాభావాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. యేసుక్రీస్తు బోధించిన సత్యం, త్యాగం, మానవతా విలువలు విద్యార్థుల జీవితాలకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. విద్య అనేది కేవలం మార్కులకే పరిమితం కాకుండా, మంచి వ్యక్తిత్వాన్ని, సామాజిక




బాధ్యతను పెంపొందించేదిగా ఉండాలని తెలిపారు. చిన్నతనం నుంచే నైతిక విలువలు అలవర్చుకుంటే భవిష్యత్తులో సమాజానికి ఆదర్శంగా నిలిచే పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. అనంతరంవిద్యార్థులు క్రిస్మస్ పాటలు, నృత్యాలు, నాటికలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. శాంతి సందేశాన్ని చాటే కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాంటా క్లాజ్ వేషధారణలో విద్యార్థులు పాల్గొనడం వేడుకలో అలరించాయి. పాఠశాల ప్రాంగణాన్ని క్రిస్మస్ అలంకరణలతో అందంగా ముస్తాబు చేయగా, పండుగ శోభ వెల్లివిరిసింది. క్రిస్మస్ శుభాకాంక్షలతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కోట పబ్లిక్ స్కూల్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రజల ఆర్థిక అభివృద్ధే దేశ ప్రగతికి నాంది

## కిసాన్ జాగరణ్ అధ్యక్షులు సగుణాకర్ రావు

మత్స్య సాగు వైపు రైతులు దృష్టి సారించాలి

కరీంనగర్, డిసెంబర్ 25(భారతశక్తి ప్రతినిధి):గ్రామీణ ప్రజల ఆర్థికంగా అభివృద్ధి చెందుతూనే దేశం సంపన్న దేశంగా విరజిల్లుతుందని కిసాన్ జాగరణ్ అధ్యక్షులు పి. సుగుణాకర్ రావు స్పష్టం చేశారు. కిసాన్ జాగరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'కిసాన్ గ్రామీణ మేళా' రెండవ రోజు అత్యంత ఉత్సాహంగా, కొనసాగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు రైతులు పాటించాల్సిన ఆధునిక సాగు పద్ధతులు, ఆదాయ వృద్ధి మార్గాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ జాగరణ్ అధ్యక్షులు, మేళా నిర్వాహకులు పి. సుగుణాకర్ రావు మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎల్ఎండీ, మిడ్ మానేరు, ఎగువ మానేరు, కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులతో నేడు ఒక వాటర్ జంక్షన్ (జల కూడలి)గా రూపాంతరం చెందిందని తెలిపారు. సమృద్ధిగా నీటి వనరులు ఉన్న ఈ ప్రాంతంలో రైతులు కేవలం వరి పంటకే పరిమితం కాకుండా, చేపలు, రొయ్యల పెంపకం వంటి లాభసాటి రంగాల వైపు దృష్టి సారించాలని సూచించారు. భవిష్యత్తులో ఇక్కడి నుంచే విదేశాలకు చేపలు, రొయ్యలు ఎగుమతి చేసే స్థాయికి రైతులు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ఎల్. జలపతిరావు మాట్లాడుతూ%రైతులు అధిక దిగుబడులు సాధించడమే కాకుండా పంట మార్పిడి విధానాలు అనుసరించాలన్నారు. ఎఫ్‌పీఓల ద్వారా సంఘటితమై, పంటల ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ బాధ్యతలను రైతులే స్వయంగా నిర్వహించినప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని స్పష్టం చేశారు. ప్రముఖ వ్యవసాయ నిపుణులు, స్వామినాథన్ శిష్యులు వెంకటేశ్వర్లు రైతాంగం ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్యలు, వాటికి సాధ్యమైన పరిష్కార మార్గాలపై సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించి రైతులకు అంకితమిచ్చారు. సదస్సులోని ఇతర ముఖ్యాంశాలుజమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీ ప్రభాకర్ గారు గొర్రెల పెంపకం, చేపల పెంపకంలో ఉన్న లాభాలను వివరించారు. కరీంనగర్ డైరీ జనరల్ మేనేజర్ శంకర్



రెడ్డి పాడి పరిశ్రమ రైతులకు ఎలా అండగా నిలుస్తుందో, కరీంనగర్ డైరీ పాత్రను వివరించారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా మేళా ప్రాంగణంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎఫ్‌పీఓ అధ్యక్షులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మేళాలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.



## మీరు అసూయ పడుతూనే ఉండండి..

**: అనసూయ లేటెస్ట్ పోస్ట్**

తాను ఏ విషయంలోనైనా బాధ పడకుండా బలంగా ముందుకు సాగుతానని నటి అనసూయ అన్నారు. హీరోయిన్‌ల దుస్తులపై శివాజీ వ్యాఖ్యలు చేయడం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. తన వ్యాఖ్యలపై ఆయన వివరణ ఇచ్చే క్రమంలో అనసూయ పేరును ప్రస్తావించగా ఆమె వరుస పోస్టలతో స్పందించారు. ఈ క్రమంలో తాజాగా ఎక్స్ వేదికగా కొన్ని పోస్టలు పెట్టారు. ''ప్రస్తుతం జరుగుతోన్న దాన్ని పక్కనపెడితే.. నేను ఏ విషయంలోనైనా నా అభిప్రాయాన్ని బలంగా వినిపిస్తాను. దేనికీ ప్రభావితం కాకుండా ధైర్యంగా నిలబడతాను. ఎన్నో ఏళ్ల నుంచి సమాజంలో నిర్లక్ష్యం చేసిన అంశాన్ని అర్థమయ్యేలా చెప్పి, దానిపై పోరాటం చేయడమే నా ఉద్దేశం. ఎన్ని జరిగినా చెప్పింది చేయడానికి నేను ఎప్పుడూ కట్టుబడి ఉంటాను. మీరు అలా అసూయపడుతూనే ఉండండి.. మేం మరింత శక్తిమంతంగా, ఆకర్షణీయంగా ముందుకుసాగుతాం'' అని అనసూయ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. జరుగుతున్నదాన్ని చెప్పడం చేతకాక కొందరు తన వయసు గురించి ప్రస్తావిస్తున్నారని ఆమె అసహనం వ్యక్తంచేశారు. తాను ఫిట్‌గా, గ్లామరస్‌గా ఉన్నానని చెప్పారు. పాత తరం ఆలోచనలను మనం ముందుకుతీసుకెళ్లాల్సిన అవసరం లేదని ఆమె అభిప్రాయపడ్డారు.


## గీత అన్న ఆ మాట తలచుకుంటే ఇప్పటికీ కన్నీరు ఆగదు

**: నటుడు నందు**



అనవసరమైన అంశాల్లో తన పేరును చేర్చినప్పుడు తాను 12 రోజుల పాటు ఎంతో బాధపడినట్లు నటుడు నందు అన్నారు. ఆ సమయంలో తన భార్య గీతా మాధురి అన్న ఒక్క మాట తలచుకుంటే ఇప్పటికీ కన్నీరు ఆగదని భావోద్వేగానికి గురయ్యారు. నందు హీరోగా తెరకెక్కిన చిత్రం 'సైక్ సిద్ధార్థ'. జనవరి 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో నందు తన కెరీర్, ఫ్యామిలీ గురించి మాట్లాడారు. ''నేను ఈ ఫీల్డ్‌లో లేకపోతే నామీద అలాంటి రూమర్స్ వచ్చే అవకాశమే ఉండేది కాదు. చూసే వాళ్లు ఎన్నో అనుకుంటారు. కానీ, వాళ్లెవరికీ దీని వెనక ఏం జరుగుతుంది, ఎన్ని గేమ్స్ ఉంటాయి, మనల్ని ఎలా ఇరికిస్తారు.. వంటి విషయాలు అర్థం కావు. మనకు బ్యాక్‌గ్రౌండ్ లేకపోతే మనం ఏం చేయలేమని సంబంధం లేని అంశాల్లో మన పేర్లు చేరుస్తారు. నేను చేయని పనికి నామీద ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో నాతో పాటు నా కుటుంబం మొత్తం బాధ పడింది. అప్పుడు గీత నాతో చెప్పిన మాట ఇప్పటికీ గుర్తుంది. 'ఇక్కడ ఉండలేం. అన్నీ వదిలేసి వేరే దేశానికి వెళ్లిపోయి హోటల్లో పని చేసుకుందాం' అని అన్నది. ఆ మాటలు గుర్తుచేసుకుంటే ఇప్పటికీ కన్నీళ్లు ఆగవు''.

# సినిమా




## అక్కడ రిలీజ్‌కు సై!

సూపర్ స్టార్ మహేష్ బాబు, డైరెక్టర్ రాజమౌళి కాంబినేషన్ లో వారణాసి మూవీ రూపొందుతున్న విషయం తెలిసిందే. ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ తో అడ్వెంచర్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం అటు సినీ ప్రియులు.. ఇటు మహేష్, జక్కన్న అభిమానులు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతున్న ఈ మూవీ 2027లో థియేటర్స్ లో విడుదల కానుంది. గ్లోబల్ స్థాయిలో 100కు పైగా దేశాల్లో మూవీని విడుదల చేసేందుకు రెడీ అవుతున్నట్లు ఇప్పటికే మేకర్స్ నుంచి క్లారిటీ వచ్చేసింది. ఒకేసారి అన్ని దేశాల్లో విడుదల చేస్తారా? లేక గ్యాప్ తీసుకుని రిలీజ్ చేస్తారా? అనే విషయంపై స్పష్టత లేనప్పటికీ జపాన్ లో మాత్రం వారణాసి గ్రాండ్ గా విడుదల అవ్వనున్నట్లు సమాచారం. ఈ మేరకు మేకర్స్ ఎలాంటి ప్రకటన చేయకపోయినా.. ఐమ్యాక్స్ జపాన్ తన సోషల్ మీడియాలో పరోక్షంగా తెలిపింది. రీసెంట్ గా వారణాసి గ్లింప్స్ ను షేర్ చేసింది. 2027లో రిలీజ్ అంటూ రాసుకొచ్చింది. దీంతో జపాన్ లో పెద్ద ఎత్తున సినిమా విడుదలవుతున్నట్లు అర్థమవుతోంది. ఇప్పటికే జక్కన్న దర్శకత్వం వహించిన బ్లాక్ బస్టర్ హిట్ మూవీ ఆర్ఆర్ఆర్ ఆ దేశంలో భారీ రికార్డులు క్రియేట్ చేసింది.

## క్రికెట్‌తో భారీగా ఆదాయం



హిందీ, తెలుగు, పంజాబీ భాషల్లో పలు సినిమాల్లో నటించి తన నటనతో ప్రేక్షకులను మెప్పించింది బాలీవుడ్‌హీరోయిన్ ప్రీతి జింటా. 1998లో దిల్‌సే మూవీతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ భామ మొదటి సినిమాతోనే తన నటనకు ఫిలింఫేర్ ఉత్తమ నటి డెబ్యూ అవార్డ్‌అందుకుంది. వైవిధ్యమైన పాత్రలను పోషించి ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా ఎన్నో పురస్కారాలు పొందింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఒకప్పుడు ఇండియన్‌ఫిల్మ్‌ఇండస్ట్రీలో టాప్‌హీరోయిన్‌గా కొనసాగింది. టాలీవుడ్, బాలీవుడ్‌స్టార్ హీరోలతో కలిసి నటించింది. మహేష్ బాబు సరసన రాజకుమారుడు, వెంకటేశ్ జోడిగా ప్రేమంటే ఇదేరా వంటి చిత్రాలతో హిట్స్ అందుకున్న ఈ భామ.. ఎక్కువగా హిందీలో నటించింది. ప్రీతి ఒక బ్రాండ్ ప్రమోట్ చేయడానికి దాదాపు రూ.1.5 కోట్లు తీసుకుంటుందట. ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్న ఈ భామ.. ఐపీఎల్ పంజాబ్‌కింగ్స్ కు యజమానిగా కొనసాగుతోంది. ఈ జట్టు కోసం ఆమె ఏకంగా రూ.35 కోట్ల వరకు పెట్టుబడి పెట్టింది. తాజా నివేదికల ప్రకారం ఆమె ఆస్తులు రూ.350 కోట్లకు పైగానే పెరిగాయి. ఆమెకు ముంబైలో రూ.17 కోట్ల విలువైన ఇల్లు, సిమ్లాలో రూ.7 కోట్ల విలువైన మరో ఇల్లు ఉన్నాయి. కెరీర్ ఫాంలో ఉండగానే.. జీన్ గుడ్ ఎనఫ్ అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. వీరికి కవలలు ఉన్నారు. ప్రస్తుతం తన భర్తతో కలిసి లాస్ ఏంజిల్స్ లో ఉంటుంది.

## కథ వినకుండా ఓకే చెప్పా

'కృష్ణమ్మ' సినిమాతో మెప్పించిన అర్చన అయ్యర్.. ఇప్పుడు ఆది సాయికుమార్‌తో కలిసి 'శంబాల' అనే ఒక ఇంట్రెస్టింగ్ హారర్ థ్రిల్లర్‌లో నటించింది. ఈ సినిమా ఇవాళ రిలీజ్ అవుతున్న సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడింది. ఈ సినిమా కథ వినకుండానే ఓకే చెప్పేశానంటోందీ అమ్మడు. సాధారణంగా ఏ హీరోయిన్ అయినా కథ మొత్తం విన్నాకే సినిమా సైన్ చేస్తారు. కానీ తాను మాత్రం 'శంబాల' కథ పూర్తిగా వినకుండా ఓకే చెప్పేశానంది. కారణం డైరెక్టర్ యుగంధర్ ముని చెప్పిన పాయింట్ అంతగా నచ్చిందంటోంది. సినిమా మొదలైన ఐదు నిమిషాలకే ఆడియెన్స్ ఒక కొత్త ప్రపంచం లోకి వెళ్ళిపోతారని, ఆ కథలో ఉండే గ్రిప్పింగ్ అలాంటిదని ఆమె కాన్ఫిడెంట్ గా చెప్పారు. ఈ సినిమాలో తాను 'దేవి' అనే అమ్మాయిగా కనిపిస్తానని, ఆ పాత్ర చుట్టూనే కథ అంతా తిరుగుతుందని వివరించారు. అందుకే కథ కూడా వినలేదని తెలిపింది. కేవలం జంప్ స్కేర్లు మాత్రమే కాకుండా, ఒక మంచి ఎమోషనల్ జర్నీ ఈ సినిమాలో ఉంటుందంటోందీ అమ్మడు.



## 'జైలర్ 2'లో షారుక్ ఖాన్.. హింట్ ఇచ్చిన నటుడు



రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన చిత్రం 'జైలర్' . బ్లాక్‌బస్టర్ హిట్‌ను అందుకున్న ఈ సినిమా ఎన్నో రికార్డులను తన ఖాతాలో వేసుకుంది. ఇప్పుడొస్తున్న సీక్వెల్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. వాటిని సీనియర్ నటుడు మిథున్ చక్రవర్తి రెట్టింపు చేశారు. 'జైలర్'లో పలు భాషలకు చెందిన అగ్రతారలు అతిథి పాత్రల్లో మెరిసిన విషయం తెలిసిందే. రెండో భాగంలోనూ ఆ సందడి కొనసాగనుంది. సీనియర్ నటుడు మిథున్ చక్రవర్తి కూడా ఇందులో కీలకపాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఆయన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'జైలర్ 2' భారీ స్థాయిలో రానుందన్నారు. ఇందులో మోహన్‌లాల్, షారుక్ ఖాన్, రమ్యకృష్ణ, శివరాజ్‌కుమార్‌లు అతిథిపాత్రల్లో కనిపించనున్నట్లు తెలిపారు. దీంతో షారుక్ ఇందులో ఉన్నట్లు ఎన్నోరోజుల నుంచి వస్తోన్న వార్తలకు బలం చేకూరినట్లైంది. తన పాత్ర గురించి ఇటీవల శివరాజ్‌కుమార్ కూడా మాట్లాడారు. ''మొదటి భాగం ఎక్కడ ఆగిపోయిందో అక్కడి నుంచే సీక్వెల్ ప్రారంభమవుతుంది. పార్ట్2లో నా పాత్ర నిడివి మొదటి భాగంతో పోలిస్తే ఎక్కువ. కొన్నిరోజులు షూటింగ్‌కు కూడా హాజరయ్యాను. జనవరిలో మిగిలిన షూటింగ్ పూర్తి చేస్తాను'' అని చెప్పారు. వచ్చే ఏడాది జూన్ 12న 'జైలర్ 2'ను విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

# 'ధోనీకి ప్రతి ఆటగాడి గురించి తెలుసు.. ఆయన వల్లే ఈ విజయం సాధ్యమైంది'

ఇటీవల ముగిసిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఝూర్ఖండ్ ఛాంపియన్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఇషాన్ కిషన్ నేతృత్వంలోని ఝూర్ఖండ్ జట్టు.. ఫైనల్‌లో హరియాణాపై విజయం సాధించి తొలిసారి SMAT టైటిల్‌ను సొంతం చేసుకుంది. అయితే, ఈ విజయం వెనుక భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ కీలకపాత్ర పోషించాడట. ఈ విషయాన్ని టీమ్‌ఇండియా మాజీ స్పిన్నర్, ప్రస్తుతం ఝూర్ఖండ్ క్రికెట్



సంఘం జాయింట్ సెక్రెటరీగా కొనసాగుతున్న షాబాజ్ నదీమ్ వెల్లడించాడు. రాష్ట్రంలో క్రికెట్ పునర్నిర్మాణం, భవిష్యత్తు ప్రణాళిక కోసం తాము ధోనీ నుంచి సలహాలు కోరినట్లు నదీమ్ తెలిపాడు. 'దేశవాళీ సీజన్ ప్రారంభమైనప్పుడు ధోనీని సంప్రదించాం. కోచింగ్ సిబ్బంది నియామకం నుంచి ప్రతి విషయంలోనూ అతని సలహాలు, సూచనలు తీసుకున్నాం. ధోనీ సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నమెంట్ విషయంలో అన్ని విషయాలు దగ్గరుండి చూసుకున్నాడు. ఆటగాళ్ల బలాలు, బలహీనతలను గుర్తించాడు. మాతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపాడు. ఝూర్ఖండ్‌కు చెందిన ప్రతి దేశవాళీ ప్లేయర్ గురించి ధోనీకి అన్ని విషయాలు తెలుసు. ఝూర్ఖండ్ క్రికెట్ అభివృద్ధికి సహాయపడాలని అతనికి చాలా ఆసక్తి ఉంది' అని షాబాజ్ నదీమ్ వివరించాడు. ఇషాన్ కిషన్ SMAT టోర్నమెంట్‌లో అదరగొట్టి తిరిగి జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నాడు. 2026 టీ20 ప్రపంచ కప్ జట్టులో ఇషాన్‌కు అవకాశం కల్పించారు. టోర్నీలో మొత్తం 517 పరుగులు చేసిన చేసిన అతను.. ఫైనల్‌లో 49 బంతుల్లో 101 పరుగులు చేశాడు. దీంతో ఝూర్ఖండ్ 3 వికెట్ల నష్టానికి 262 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో హరియాణా 193 పరుగులకే పరిమితమైంది. 2019లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ధోనీ.. ఐపీఎల్‌లో కొనసాగుతున్న విషయం తెలిసిందే.




## 2025-26: ఆ స్టార్ బ్యాటర్ కోసం
# చెట్లెక్కిన అభిమానులు

విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా బెంగళూరు వేదికగా దిల్లీ, ఆంధ్ర జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో దిల్లీ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సెంచరీతో (131; 101 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరిశాడు. అయితే ఈ మ్యాచ్ లైవ్ ప్రసారం కాలేదు. అలాగే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్ 1 గేట్లను తెరవకుండానే ఈ మ్యాచ్‌ను బీసీసీఐ నిర్వహించింది. దీంతో కోహ్లీ అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. కొంతమంది అభిమానులు మాత్రం ప్రమాదకర రీతిలో చుట్టుపక్కల ఉన్న చెట్లపైకి చేరి విరాట్ కోహ్లీ బ్యాటింగ్‌ను వీక్షించారు. భద్రతా కారణాలను చూపుతూ కర్ణాటక ప్రభుత్వం ఎం.చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహించడానికి అనుమతి ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ మ్యాచ్‌లను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు మార్చాల్సి వచ్చింది. ఈ మ్యాచ్‌ను అభిమానులు వీక్షించలేకపోయారు. దీంతో కోహ్లీ.. అభిమానుల కేరింతలు, చప్పట్లు లేకుండానే బ్యాటింగ్‌కు వచ్చాడు. దాదాపు నిశ్శబ్ద వాతావరణంలోనే అతడు తన సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ లాంటి స్టార్ బ్యాటర్లు ఆడే మ్యాచ్‌లనైనా ప్రత్యక్ష ప్రసారం చేయాలని పలువురు అభిమానులు బీసీసీఐని కోరుతున్నారు.

# జట్టులోకి రావడానికి జైస్వాల్ ఇంకా ఏం చేయాలి? : దిలీప్ వెంగ్‌సర్కార్

2026 టీ20 ప్రపంచకప్ కోసం ఇటీవల భారత సెలక్టర్లు జట్టును ప్రకటించారు. యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్‌కు జట్టులో చోటు కల్పించకపోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. మూడు ఫార్మాట్లలో ఆడగలిగే సత్తా ఉన్న అతడిని ఎందుకు పక్కన పెట్టారని అభిమానులు సోషల్ మీడియాలో ప్రశ్నించారు. తాజాగా భారత మాజీ కెప్టెన్ దిలీప్ వెంగ్‌సర్కార్ కూడా ఈ అంశంపై స్పందిస్తూ.. జట్టులోకి రావడానికి జైస్వాల్ ఇంకా చేయాలి?అంటూ ఫైర్ అయ్యాడు. 'అతని తప్పు లేకుండానే యశస్వి జైస్వాల్‌ను పదే పదే తప్పించడం దురదృష్టకరం. అతను ఆటలోని అన్ని ఫార్మాట్లలో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. జట్టులోకి రావడానికి అతను ఇంకా ఏం చేయాలో నాకు తెలియదు. మ్యాచ్ విన్నర్‌ను ఎవరూ జట్టు నుంచి తప్పించకూడదు. టీ20 ప్రపంచకప్‌నకు ఎంపికైన వారంతా నాణ్యమైన ఆటగాళ్లే. శుభ్‌మన్ గిల్ విషయంలో సెలక్టర్లు తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తా. గిల్‌కి బదులు ఎవరిని ఎంచుకుంటారని మీరు అడిగితే నేను జైస్వాల్ వైపు మొగ్గుచూపుతా. అతను క్లాస్



పెర్ఫార్మర్‌గా పదే పదే నిరూపించుకున్నాడు. ఎన్నోసార్లు జట్టుకు శుభారంభాలు అందించాడు. ఏ ఆటగాడినైనా ఒక ఫార్మాట్‌లో వరుసగా జట్టు నుంచి తప్పిస్తే ఇక తన అవసరం లేదని భావించి ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతాడు. క్రికెట్‌లో ఆత్మవిశ్వాసం అనేది చాలా ముఖ్యం' అని వెంగ్‌సర్కార్ అన్నాడు. యశస్వి జైస్వాల్ టీమ్‌ఇండియా తరఫున జులై 2024లో చివరి టీ20 మ్యాచ్ ఆడాడు. తర్వాత అతను టెస్టులపై ఎక్కువ ఫోకస్ పెట్టేలా టీమ్‌మేనేజ్‌మెంట్ ప్రోత్సహించింది. జనవరి 11 నుంచి కివీస్‌తో భారత్ మూడు వన్డేల సిరీస్‌లో తలపడనుంది. ఆ సిరీస్‌కు జైస్వాల్ ఎంపికైనా.. బెంచ్‌కే పరిమితమవడం ఖాయంగా కనిపిస్తోంది. ఎందుకంటే రెగ్యులర్ వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. రోహిత్ శర్మతో కలిసి ఓపెనింగ్ చేస్తాడు.

# బెంగళూరు CoEకి శ్రేయస్ అయ్యర్..



గాయం బారినపడిన బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టడంపై దృష్టి సారించాడు. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేకుండా బ్యాటింగ్ చేస్తున్న అతను గురువారం బెంగళూరులో ఉన్న బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్కి వెళ్లాడు. 'శ్రేయస్ అయ్యర్ దురదృష్టవశాత్తు గాయపడ్డాడు. దీంతో అతను చాలా మ్యాచ్‌లకు దూరమయ్యాడు. మంచి విషయం ఏంటంటే.. ప్రస్తుతం అతడు నొప్పి లేకుండా ఉన్నాడు. బుధవారం ముంబయిలో ఎలాంటి ఇబ్బందీ లేకుండా బ్యాటింగ్ చేశాడు. రెగ్యులర్‌గా జిమ్‌లో కసరత్తులు చేస్తున్నాడు. నాలుగైదు రోజుల పాటు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గడుపుతాడు. అక్కడ అయ్యర్ ఫిట్‌నెస్‌ను మెడికల్, స్పోర్ట్స్ సైన్స్ స్టాఫ్ అంచనా వేస్తుంది' అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. జనవరి 11 నుంచి భారత్, న్యూజిలాండ్ మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ కోసం జనవరి 2 లేదా 3న జట్టును ప్రకటించనున్నట్లు సమాచారం.


# హెర్బల్ టీ అనొద్దు.. FSSAI కీలక ఆదేశాలు

దిల్లీ: ఒకప్పుడు మార్కెట్‌లో టీ అంటే.. టీపొడి, చక్కెర, పాలుతో చేసినది మాత్రమే. కానీ, తర్వాతి కాలంలో బ్లాక్ టీ, గ్రీన్ టీ వంటివి ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఇటీవల కాలంలో హెర్బల్ టీ పేరుతో విక్రయాలు సాగుతున్నాయి. దీనిపై ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కీలక ఆదేశాలు ఇచ్చింది. మూలికలు, మొక్కల నుంచి సేకరించిన మిశ్రమాలతో తయారుచేసేవాటిని టీ పేరుతో పిలవొద్దని ఆహార వ్యాపార నిర్వాహకులకు సూచించింది. ఇవేవీ కామెల్లియా సినెన్సిస్ (తేయాకు శాస్త్రీయ నామం) సేకరించినవి కావు కాబట్టి టీగా వ్యవహరించొద్దని సూచించింది. చట్టం ప్రకారం.. ఇది తప్పుడు, తప్పుదోవ పట్టించే ప్రచారం అవుతుందని పేర్కొంది. ఇటీవల కాలంలో రూయిబోస్ టీ, హెర్బల్ టీ, ఫ్లవర్ టీ వంటి పేరుతో విక్రయాలు సాగుతున్న నేపథ్యంలో FSSAI ఈ ఆదేశాలు ఇచ్చింది. ఇవేవీ తేయాకు మొక్క నుంచి సేకరించినవి కావని స్పష్టం చేసింది. తేయాకు మొక్కల నుంచి సేకరించిన వాటిని మాత్రమే టీగా వ్యవహరించాలని స్పష్టం




చేసింది. కాంగ్రా టీ, గ్రీన్ టీ, ఇన్‌స్టంట్ టీ వంటి రకాలను టీగా వ్యవహరించొచ్చని పేర్కొంది. ఇవి తప్ప తేయాకు సంబంధం లేని ఉత్పత్తులను టీగా వ్యవహరించొద్దని పునరుద్ఘాటించింది. అలా చేయడం ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006ను ఉల్లంఘించడమే అవుతుందని స్పష్టం చేసింది. కాబట్టి ఇకామర్స్ సంస్థలు, తయారీదారులు, ప్యాకింగ్, మార్కెటింగ్, దిగుమతిదారులు, విక్రేతలంతా ఈ నిబంధనలు పాటించాలని స్పష్టం చేసింది. క్షేత్ర స్థాయిలో ఈ ఆదేశాలు అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకోవాలని సూచించింది.

## అందరి అంచనాలు తలకిందులు..
# ఈ ఏడాది అత్యధికంగా అమ్ముడయింది ఈ కారే!




భారత ఆటోమొబైల్ మార్కెట్లో ఎస్‌యూవీల హవా కొనసాగుతున్నప్పటికీ, 2025లో అందరినీ ఆశ్చర్యపరుస్తూ మారుతీ సుజుకీ డిజైర్ సెడాన్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ ఏడాది (జనవరి నవంబర్) అత్యధికంగా అమ్ముడైన కారుగా రికార్డు సృష్టించింది. ప్రముఖ ఎస్‌యూవీ మోడళ్లయిన హ్యుందాయ్ క్రెటా, టాటా నెక్సాన్‌లను వెనక్కి నెట్టి డిజైర్ టాప్ ప్లేస్‌కు చేరుకోవడం విశేషం. 2025లో ఇప్పటివరకు 1,95,416 యూనిట్ల డిజైర్ కార్లు అమ్ముడయ్యాయి. గత 41 ఏళ్లలో ఒక సెడాన్ మోడల్ అమ్మకాల్లో అగ్రస్థానంలో నిలవడం ఇది రెండోసారి మాత్రమే. దీని తర్వాత 1,87,968 యూనిట్ల అమ్మకాలతో హ్యుందాయ్ క్రెటా రెండో స్థానంలో, 1,81,186 యూనిట్లతో టాటా నెక్సాన్ మూడో స్థానంలో ఉన్నాయి. ప్రస్తుతం దేశీయ ప్యాసింజర్ వాహనాల మార్కెట్లో ఎస్‌యూవీల వాటానే 55 శాతంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో టాప్10 బెస్ట్ సెల్లింగ్ కార్ల జాబితాలో చోటు దక్కించుకున్న ఏకైక సెడాన్ మారుతీ డిజైర్ కావడం గమనార్హం. ఈ జాబితాలో 6 ఎస్‌యూవీలు, 2 హ్యాచ్‌బ్యాక్‌లు, ఒక ఎంపీవీ మోడల్ ఉన్నాయి. ఈ టాప్10 జాబితాలో మారుతీ సుజుకీకి చెందిన 6 మోడళ్లు ఉండగా, టాటా మోటార్స్ నుంచి రెండు, మహీంద్రా, హ్యుందాయ్ నుంచి చెరొకటి ఉన్నాయి. జాబితాలో తర్వాతి స్థానాల్లో మారుతీ వ్యాగన్ ఆర్ (1,79,663), ఎర్టిగా (1,75,404), స్విఫ్ట్ (1,70,494), మహీంద్రా స్కార్పియో (1,61,103), మారుతీ ఫ్రాంక్స్ (1,59,188), బ్రెజ్జా (1,57,606), టాటా పంచ్ (1,57,522) ఉన్నాయి. ఇటీవల జీఎస్టీ తగ్గింపు, పండుగ సీజన్ ఆఫర్లు, ఇయర్ ఎండ్ డిస్కౌంట్ల కారణంగా కార్ల ధరలు తగ్గడం వంటి అంశాలు అమ్మకాలు పెరగడానికి దోహదపడ్డాయి.




# 10 ఏళ్లలో పెట్రోల్ పంపులు డబుల్.. అత్యధికం ఈ కంపెనీ చేతిలోనే..

దిల్లీ: దేశంలో పెరుగుతున్న వాహన వినియోగానికి అనుగుణంగా పెట్రోల్ పంపుల సంఖ్యా నానాటికీ పెరుగుతోంది. ఈ ఏడాది నవంబర్ నాటికి 1,00,266కి చేరింది. 2015తో పోలిస్తే ఈ సంఖ్య రెట్టిపైంది. అమెరికా, చైనా తర్వాత అత్యధిక పెట్రోల్ పంపులు కలిగిన దేశంగా భారత్ మూడో స్థానంలో నిలిచింది. ఈ మేరకు చమురు మంత్రిత్వ శాఖ పరిధిలోని పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలసిస్ సెల్ (PPAC) డేటాలో వెల్లడైంది. దేశంలో పెట్రోల్ పంపుల్లో సింహభాగం ప్రభుత్వరంగ సంస్థలదే. ఇండియన్ ఆయిల్ కార్పరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (HPCL) సంయుక్తంగా 90శాతం వాటా కలిగి ఉన్నాయి. రష్యా రాస్‌నెఫ్ట్ మద్దతు కలిగిన నయరా ఎనర్జీ లిమిటెడ్‌కు దేశవ్యాప్తంగా 6,921 ఔట్‌లెట్లు ఉండగా.. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, బీపీ జాయింట్ వెంచర్‌కు 2,114 స్టేషన్లు ఉన్నాయి. షెల్ కంపెనీ 346 పెట్రోల్ పంపులు నిర్వహిస్తోంది.

### 10 ఏళ్లలో డబుల్

2015 నాటికి దేశంలో 50,451 పెట్రోల్ స్టేషన్లు ఉన్నట్లు పీపీఏసీ గణాంకాలు చెబుతున్నాయి. అప్పట్లో ప్రైవేటు కంపెనీలు 5.9 శాతం వాటాతో 2,967 ఔట్‌లెట్లు మాత్రమే కలిగి ఉండేవి. నేడు వాటి మార్కెట్ వాటా 9.3 శాతానికి పెరిగింది. 2004లో 27 బంకులతో ప్రైవేటు కంపెనీలు ఈ మార్కెట్‌లోకి ప్రవేశించాయి. ప్రపంచవ్యాప్తంగా చూసినప్పుడు అమెరికాలో అత్యధిక పెట్రోల్ పంపులు ఉన్నాయి.



2024 నాటి లెక్కల ప్రకారం 1,96,643 రిటైల్ గ్యాస్ స్టేషన్‌లు ఉన్నాయనేది అంచనా. ఆ తర్వాత కొన్ని మూత పడ్డాయి. చైనాలో 1,15,228 గ్యాస్ స్టేషన్లు ఉన్నాయి. చైనాకు చెందిన సినోపెక్ 30 వేలకు పైగా గ్యాస్ స్టేషన్లు నిర్వహిస్తూ అగ్రస్థానంలో ఉంది.

### భారత్‌లో ఐఓసీదే అగ్రస్థానం

దేశీయ పెట్రోల్ పంపులు అత్యధికంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చేతిలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా 41,664 ఔట్‌లెట్లను ఈ సంస్థ నిర్వహిస్తోంది. 24,605 స్టేషన్లతో బీపీసీఎల్, 24,418తో హెచ్‌పీసీఎల్ మూడో స్థానంలో ఉన్నాయి. మొత్తం బంకుల్లో 29 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. దశాబ్దం క్రితం ఈ సంఖ్య 22 శాతంగా ఉండేది. ఒకప్పుడు పెట్రోల్, డీజిల్ మాత్రమే విక్రయించే ఔట్‌లెట్లు.. నేడు సీఎన్‌జీ, ఈవీ ఛార్జింగ్ పాయింట్లనూ ఏర్పాటు చేసుకుంటున్నాయి. పెట్రోలియం ఉత్పత్తుల ధరలపై పరోక్షంగా ప్రభుత్వ నియంత్రణ ఉండడంతో రెండు దశాబ్దాల తర్వాత కూడా ఈ రంగంలో ప్రైవేటు కంపెనీల వాటా నామమాత్రంగానే ఉంది. అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా రోజువారీ ధరలను నిర్ణయించే అధికారం ప్రభుత్వం ఎప్పుడో మార్కెట్ శక్తులకు వదిలేసినప్పటికీ.. 2021 నవంబర్ నుంచి వాటి ధరల్లో మార్పు ఉండడం లేదు.

# ఉదయం పూట ఖాళీ కడుపుతో తీసుకోదగిన ఆహారం, ఏంటి ?



* ఖాళీ కడుపుతో కొన్ని ఆహార పదార్థాలను తినవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఉదయం అల్పాహారంగా శరీరంలో జీవక్రియను పెంచే ఆహారాన్ని తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెపుతారు. అల్పాహారంగా దోసె, ఇడ్లీ వంటివి తీసుకుంటున్నప్పటికీ అంతకంటే ముందు వీటిని తీసుకుంటే మంచిదని అంటున్నారు. అవేంటో తెలుసుకుందాము.
* బాదంపప్పను రాత్రంతా నీళ్లలో నానబెట్టి మరుసటిరోజు ఉదయాన్నే వాటి పొట్టు తీసి తినండి.
* గోరువెచ్చని నీళ్లలో తేనె కలుపుకుని ఉదయాన్నే పరగడుపున తాగితే టాక్సిన్స్ సులభంగా బయటకు వెళ్లిపోతాయి.
* ఉదయాన్నే ఖాళీ కడుపుతో అరచెంచా లెమన్ గ్రాస్ రసం తాగడం వల్ల జీర్ణ అవయవాల పనితీరు మెరుగుపడుతుంది.
* ఎండుద్రాక్షను రాత్రంతా నీటిలో నానబెట్టి ఉదయాన్నే తీసుకుంటే పోషకాలను పూర్తిగా గ్రహించవచ్చు.
* చియా గింజలు కూడా ఉదయం వేళ మేలు చేసే ఆహారంగా చెప్పబడింది.



# దాల్చిన చెక్కలో దాగున్న ఆరోగ్య రహస్యాలు

* దాల్చిన చెక్క. ఈ మసాలా దినుసును పాలతో కలిపి తాగడం వల్ల రాత్రిపూట ఒత్తిడిని తగ్గిస్తుంది. మంచి నిద్రను పొందేలా చూసే ఆరోగ్యానికి చురుకైన విధానంలో భాగమయ్యే పానీయం ఇది. దాల్చిన చెక్కతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాము.
* బరువు తగ్గడానికి, ముఖ్యంగా పొట్ట దగ్గర కొవ్వును తగ్గించాలనుకుంటే ఆహారాలలో దాల్చినచెక్కను జోడిస్తుండాలి.
* దాల్చినచెక్క ఆకలిని అణచివేయడం, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడం చేస్తుంది.
* జీవక్రియను వేగవంతం చేయడం ద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది.
* దాల్చిన చెక్క, శొంఠి, యాలుకలు, సైంధవ లవణ చూర్ణాలను సమానంగా కలిపి అర గ్లాసు గోరువెచ్చని నీటితో కలిపి తాగితే అజీర్ణం, కడుపు ఉబ్బరం తగ్గుతాయి.
* దాల్చిన చెక్క, పసుపు, పొడపత్రి, నల్లజీలకర్ర చూర్ణాలను సమానంగా కలిపి ఉంచుకుని అరచెంచా పొడిని పావు గ్లాసు నీటిలో కలిపి తాగితే మధుమేహ వ్యాధి నియంత్రణలో ఉంటుంది.
* ఒక గ్రాము దాల్చిన చెక్క పొడిని తగినంత తేనెతో కలిపి ఉదయం, సాయంత్రం తీసుకుంటే జలుబూ, దగ్గు తగ్గుతాయి.
* ఒక భాగం దాల్చిన చెక్క చూర్ణానికి మూడు భాగాలు తేనె కలిపి, రాత్రి పట్టించి ఉదయం గోరువెచ్చని నీటితో కడుగుతుంటే మొటిమల సమస్య తగ్గిపోతుంది.
* దాల్చిన చెక్కని నిమ్మరసంతో నూరి తీసిన గంధాన్ని పట్టిస్తుంటే నల్లమచ్చలు తగ్గిపోతాయి.



# ఔషధ గుణం కలిగిన కరక్కాయ

## కరక్కాయ దేనికి ఉపయోగిస్తారు, ప్రయోజనాలు ఏమిటి?



* కరక్కాయ. ఇది ఆరోగ్యానికి చేసే మేలు అంతాఇంతా కాదు. కరక్కాయతో పలు అనారోగ్య సమస్యలను ఇట్టే వదిలించుకోవచ్చు. అవేంటో చూద్దాం.
* వాంతులవుతున్నప్పుడు కరక్కాయపొడిని మంచినీళ్లలో వేసుకుని తాగితే వాంతులు తగ్గుతాయి.
* మలబద్దకంతో బాధపడేవారు కరక్కాయను వాడితే విరోచనం సాఫీగా అవుతుంది. ఇది వాతాన్ని హరిస్తుంది.
* తలనొప్పితో బాధపడేవారు కరక్కాయను అరగదీసి ఆ గంధాన్ని నుదుటన పట్టిస్తే తలనొప్పి, కళ్లమంటలు తగ్గుతాయి.
* కరక్కాయ పొడిలో మెత్తని ఉప్పుచేర్చి పండ్లు తోముకొనిన చిగుళ్లు దృఢమై పంటివ్యాధులు రావు.
* కరక్కాయలో చలువ చేసే గుణం ఉంది. ఇది పైత్యాన్ని హరిస్తుంది.
* దగ్గుతో బాధ పడేవారు కరక్కాయ బుగ్గన ఉంచుకుంటే మంచి ఉపశమనం లభిస్తుంది.
* కరక్కాయ ముక్కలను నీళ్లలో నానబెట్టి, ఆ నీటిని తాగితే గుండెకు బలం చేకూరుతుంది.



# కొత్త సంవత్సరం డిస్కౌంట్ కూపన్లంటే నమ్మకండి




సైబర్ నేరస్థులు కొత్త కొత్త ఐడియాలతో ప్రజలను మోసగిస్తున్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు, డిస్కౌంట్ కూపన్లు లేదా ఈవెంట్ పాస్‌ల ముసుగులో, ప్రజల వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని దొంగిలించడానికి మోసపూరిత లింక్‌లను పంపుతున్నారని సైబర్ క్రైమ్ అధికారులు హెచ్చరించారు. బాధితులు ఇలాంటి సందేశాలను అందుకునేటప్పుడు జాగ్రత్త వహించాలి. తక్కువ ధరలకు ఈవెంట్ పాస్‌లు లేదా డిస్కౌంట్‌లను అందిస్తారని మోసం చేస్తారు. అయితే, ఈ లింక్‌లపై క్లిక్ చేయడం ఫోన్ హ్యాకింగ్‌కు గురవుతుంది. ఆపై నేరస్థులు బ్యాంక్ ఖాతా వివరాలతో కూడిన డేటాను దొంగలిస్తారు. అటువంటి లింక్‌లను ఫార్వార్డ్ చేయడం వల్ల ఇతరులు కూడా అదే ఉచ్చులో పడే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. అందుకు తెలియని వారి నుంచి వచ్చే నూతన సంవత్సర శుభాకాంక్షలు, డిస్కౌంట్ ఆఫర్‌లు లేదా ఈవెంట్ పాస్ లింక్‌లను నమ్మవద్దని సైబర్ నిపుణులు ప్రజలను కోరారు.



# విష్ణుమూర్తి విగ్రహం కూల్చివేత.. రెండు దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తత

డిసెంబర్ 25 (భారత శక్తి) : థాయిలాండ్, కంబోడియా మధ్య సరిహద్దు వివాదం కొనసాగుతుండగానే ఒక కొత్త వివాదం రాజుకుంది. తమ భూభాగంలోని విష్ణుమూర్తి విగ్రహాన్ని థాయిలాండ్ ధ్వంసం చేసిందని కంబోడియా తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ అంశం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. ఏఎఫ్‌పీ వార్తాసంస్థ కథనం ప్రకారం వివాదాస్పద అన్ సెస్ ప్రాంతంలో ఉన్న విష్ణుమూర్తి విగ్రహాన్ని థాయిలాండ్ కూల్చివేసిందని కంబోడియాలోని ప్రీ విహార్ ప్రతినిధి లిమ్ చన్‌పన్హా ఆరోపించారు. 2014లో నిర్మించిన ఈ విగ్రహం కంబోడియా భూభాగంలోనే ఉందని, థాయిలాండ్ సరిహద్దుకు కేవలం 100 మీటర్ల దూరంలో సోమవారం ఈ ధ్వంసం జరిగిందని ఆయన వివరించారు. "హిందువులు, బౌద్ధులు పూజించే పురాతన ఆలయాలు, విగ్రహాలను కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం" అని ఆయన అన్నారు. విగ్రహాన్ని బుల్డోజర్ (బ్యాక్‌హో లోడర్) తో కూల్చివేస్తున్న దృశ్యాలున్న వీడియో ఒకటి వైరల్ అయింది. ఈ వీడియోను కృత్రిమ మేధస్సు (AI) తో ఎడిట్ చేయలేదని ఏఎఫ్‌పీ తన నివేదికలో పేర్కొంది. ఈ ఆరోపణలపై థాయిలాండ్ అధికారులు ఇంకా స్పందించలేదు. ఘటనపై భారత్ కూడా ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదని బ్యాంకాక్‌లోని భారత రాయబార కార్యాలయ వర్గాలు తెలిపాయి. మరోవైపు ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని పునరుద్ధరించడంపై సైనిక అధికారులు చర్చలు ప్రారంభించారు. గత 16 రోజులుగా జరిగిన భీకర ఘర్షణల్లో 86 మంది మరణించిన నేపథ్యంలో ఈ చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## భారీ బొగ్గు నిక్షేపాలు.. 60 ఏళ్లకు సరిపడా విద్యుత్ ఉత్పత్తికి అవకాశం!

అమరావతి, డిసెంబర్ 25 (భారత శక్తి) : ఏపీ త్వరలో దేశ బొగ్గు ఉత్పత్తి చిత్రపటంలో స్థానం సంపాదించనుంది. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం పరిధిలోని రేచర్ల బ్లాకులో బొగ్గు తవ్వకాలు ప్రారంభించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ బ్లాకులో బొగ్గు వెలికితీత, గ్యాసిఫికేషన్ కోసం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు హైదరాబాద్‌కు చెందిన యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి. దేశవ్యాప్తంగా మొత్తం 41 బొగ్గు బ్లాకుల్లో ఉత్పత్తి లేదా గ్యాసిఫికేషన్ చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది అక్టోబరులో బిడ్లను ఆహ్వానించింది. ఇందులో భాగంగా ఈ రెండు కంపెనీలు సంయుక్తంగా 17 బ్లాకుల కోసం బిడ్లు సమర్పించాయి. అందులో ఏపీలోని రేచర్ల బ్లాక్ కూడా ఒకటి కావడం గమనార్హం.

**రేచర్ల బ్లాక్ ప్రాధాన్యత**

ఏలూరు జిల్లాలోని ఈ రేచర్ల బ్లాకులో అత్యంత నాణ్యమైన గ్రేడ్ 1 బొగ్గు నిక్షేపాలు భారీ స్థాయిలో ఉన్నాయని అంచనా వేస్తున్నారు. ఇక్కడ సుమారు 200 నుంచి 300 కోట్ల టన్నుల బొగ్గు అందుబాటులో ఉంటుందని భావిస్తున్నారు. ఈ నిక్షేపాల ద్వారా ఏటా 8,000 మెగావాట్ల విద్యుత్‌ను దాదాపు 60 సంవత్సరాల పాటు నిరంతరాయంగా ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ తవ్వకాలు ప్రారంభమైతే రాష్ట్ర ఇంధన అవసరాలకు ఇది కీలకంగా మారనుంది.

## సీఎంతో విజయవాడ ఎంపీ భేటీ .. ఆ కీలక అంశంపై వినతి

అమరావతి, డిసెంబర్ 25 (భారత శక్తి) : గ్రేటర్ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుకు తక్షణమే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కోరారు. ఈ మేరకు ఆయన, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. సుస్థిర ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరించి గ్రేటర్ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అత్యవసరమని కోరుతూ అందుకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా అందజేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రేటర్ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నగర పరిసరాల్లోని 74 గ్రామాలు విలీనమై గ్రేటర్ విజయవాడ కార్పొరేషన్ ఏర్పాటైతే పారిశ్రామిక కారిడార్లు, ఐటీ పార్కులు, లాజిస్టిక్స్ హబ్‌లు, పర్యాటక పెట్టుబడులకు మరింత ప్రోత్సాహం లభించి, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని, సమగ్ర నీటి సరఫరా, వరద నియంత్రణ చర్యలు సమర్థవంతంగా అమలు చేయడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా, కృష్ణా జిల్లా మధ్య ఉన్న పరిపాలనా విభజన వల్ల పోలీస్, రవాణా, శాంతి భద్రతలు, విమానాశ్రయ పరిపాలన వంటి అంశాల్లో తలెత్తుతున్న ప్రోటోకాల్ ఇబ్బందులకు ఒక పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రికి తెలియజేశారు. విజయవాడ నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తాము చేసిన ప్రతిపాదనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని కేశినేని చిన్ని పేర్కొన్నారు. గ్రేటర్ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌పై త్వరలో ప్రభుత్వం సానుకూల

## పట్టుబడితే.. బండి సీజ్

హైదరాబాద్, డిసెంబర్ 25 (భారత శక్తి) : హైదరాబాద్ నగరంలో రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీస్ శాఖ... డ్రంకెన్ డ్రైవ్‌పై ఉక్కుపాదం మోపుతోంది. క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్వయంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను పర్యవేక్షించారు. నిన్న రాత్రి బంజారాహిల్స్‌లోని టీజీ స్టడీ సర్కిల్ పరిసరాల్లో నిర్వహించిన తనిఖీల్లో సీపీ పాల్గొని, పోలీసు సిబ్బంది పనితీరును పరిశీలించారు. తనిఖీల విధానంపై సూచనలు ఇవ్వడమే కాకుండా, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి స్వయంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రంకెన్ డ్రైవ్ వల్ల కలిగే ప్రమాదాలపై సీపీ సజ్జనార్ వాహనదారులకు స్పష్టంగా వివరించారు. "ప్రతిరోజూ మీడియాలో చెబుతున్నాం. అయినా చదువుకున్న వారు కూడా ఇలా మద్యం తాగి డ్రైవ్ చేస్తే ఎలా?" అని ఆయన ప్రశ్నించారు. నిర్లక్ష్యం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు తెచ్చే ప్రమాదం ఉందని అన్నారు. పబ్‌లు, పార్టీలకు వెళ్లే వారు తప్పనిసరిగా డ్రైవర్లను వెంట తీసుకురావాలని లేదా క్యాబ్‌లు బుక్ చేసుకోవాలని సూచించారు. సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ప్రవర్తించవద్దని హెచ్చరించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డిసెంబరు 31 రాత్రి వరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని సీపీ స్పష్టం చేశారు. నగరవ్యాప్తంగా సుమారు 120 ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తామని వెల్లడించారు. డ్రంకెన్ డ్రైవ్‌పై ఎలాంటి ఉపేక్ష ఉండదని సజ్జనార్ తేల్చిచెప్పారు. అలా పట్టుబడిన వారి వాహనాన్ని సీజ్ చేస్తామని, రూ. 10 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. 6 నెలల జైలు శిక్ష కూడా తప్పదని స్పష్టం చేశారు. సేవించిన మద్యం మోతాదును బట్టి శాశ్వతంగా లైసెన్స్ రద్దుకు రవాణా శాఖకు సిఫారసు చేస్తామని తెలిపారు.

## న్యూ ఇయర్ వేడుకలు..
## నగరంలో డిసెంబర్ 31 వరకు తనిఖీలు

హైదరాబాద్, డిసెంబర్ 25 (భారత శక్తి) : 2026 నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో డిసెంబర్ 31 వరకు హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ తనిఖీలు చేపట్టనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఇందులో భాగంగా ఈరోజు నిర్వహించిన తనిఖీలలో 304 మంది పట్టుబడ్డారు. ట్రాఫిక్ పోలీసులు వారి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈగల్ టీమ్ సిబ్బంది మేడిపల్లిలోని గంజాయి పెడ్లర్స్‌పై దాడులు నిర్వహించి పలువురిని అరెస్టు చేసింది. మేడిపల్లి పోలీసులతో కలిసి ఈ దాడులు నిర్వహించారు. నిందితుల నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిని అక్రమ్, షఫీ, పృథ్వీరాజ్, రాహుల్‌గా గుర్తించారు. పృథ్వీరాజ్ కొవిడ్ తర్వాత ఉపాధి కోల్పోయి, ఆ తరువాత ఒడిశా నుంచి గంజాయి తెచ్చి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు.

## భారీ ఎన్‌కౌంటర్.. ఐదుగురు మావోల మృతి



ఒడిశా, డిసెంబర్ 25 (భారత శక్తి) : ఒడిశాలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. కందమాల్ జిల్లాలో జరిగిన ఈ ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో ఒక మహిళ కూడా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఘటనా స్థలం నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. కందమాల్ జిల్లాలోని గుమ్మా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నట్టు భద్రతా బలగాలకు పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసులు, ప్రత్యేక బలగాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో ఓ చోట మావోయిస్టులు తారసపడటంతో లొంగిపోవాలని బలగాలు హెచ్చరించాయి. అయితే, మావోయిస్టులు కాల్పులకు తెగబడటంతో భద్రతా దళాలు ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు అక్కడికక్కడే చనిపోయారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన బలగాలు ఒక రివాల్వర్, పాయింట్ 303 రైఫిల్, ఒక వాకీటాకీ సెట్‌ను స్వాధీనం చేసుకున్నాయి. ప్రస్తుతం ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

## టీటీడీ గుడ్ న్యూస్..
## వైకుంఠ దర్శనంపై కీలక ప్రకటన

తిరుమల, డిసెంబర్ 25 (భారత శక్తి) : తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాల కోసం ఎదురుచూస్తున్న స్థానిక భక్తులకు టీటీడీ శుభవార్త చెప్పింది. తిరుమల, తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి ప్రాంతాల వారికి ప్రత్యేక కోటా కింద దర్శన టోకెన్లు జారీ చేయనున్నట్లు ప్రకటించింది. జనవరి 6, 7, 8 తేదీల్లో దర్శనం కోసం రోజుకు 5,000 చొప్పున టోకెన్లు కేటాయించనుంది. ఈ టోకెన్ల కోసం ఆసక్తి ఉన్న స్థానికులు నేటి నుంచి ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ వివరాలు నమోదు చేసుకోవాలి. టీటీడీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ లేదా వాట్సాప్ ద్వారా 1+3 విధానంలో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి వాసులకు రోజుకు 4,500 టోకెన్లు, తిరుమలలో నివసించేవారికి 500 టోకెన్లు కేటాయిస్తారు. నమోదు చేసుకున్న వారిలో నుంచి 'ఈడిప్' పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసి, ఈ నెల 29న మధ్యాహ్నం 2 గంటలకు వివరాలు ప్రకటిస్తారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీటీడీ సూచించింది. ఇదిలా ఉంటే.. తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో జనవరి, ఫిబ్రవరి నెలల్లో జరగనున్న విశేష ఉత్సవాల వివరాలను టీటీడీ వెల్లడించింది. జనవరి 3న పౌర్ణమి గరుడసేవ, 14న భోగి తేరు, 16న గోదా కల్యాణం, 17న పార్వేటి ఉత్సవం, 25న రథసప్తమి, జనవరి 27 నుంచి ఫిబ్రవరి 1 వరకు తెప్పోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు.

## పర్వతంపై విషాదం.. హెలికాప్టర్ కూలి ఐదుగురి మృతి

టాంజానియాలోని కిలిమంజారో పర్వతంపై ఘోర హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. అనారోగ్యంతో బాధపడుతున్న పర్యాటకులను రక్షించేందుకు వెళ్లిన హెలికాప్టర్ బరాఫు క్యాంప్ వద్ద కూలిపోయింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురూ మరణించినట్లు టాంజానియా సివిల్ ఏవియేషన్ అథారిటీ (TCAA) ఇవాళ ఒక ప్రకటనలో వెల్లడించింది. మృతుల్లో ఇద్దరు చెక్ రిపబ్లిక్ దేశానికి చెందిన పర్యాటకులు, ఒక జింబాబ్వే పైలట్, ఒక టాంజానియా డాక్టర్, మరో స్థానిక పర్వత గైడ్ ఉన్నారని పోలీసులు గుర్తించారు. ఇద్దరు చెక్ రిపబ్లిక్ పర్యాటకులకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో వారిని అక్కడి నుంచి తరలించేందుకు ఈ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. టాంజానియాకు చెందిన ఒక సంస్థకు చెందిన ఎయిర్‌బస్ H125 హెలికాప్టర్ ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నట్లు కిలిమంజారో ప్రాంతీయ పోలీస్ కమాండర్ సైమన్ మైగ్వా తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. ఆఫ్రికాలోనే అత్యంత ఎత్తైన పర్వతమైన కిలిమంజారో, ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను, పర్వతారోహకులను ఆకర్షిస్తుంది. ఈ ప్రాంతంలో పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు టాంజానియా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగానే కిలిమంజారో పర్వతంపై కేబుల్ కార్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు ఈ ఏడాది ఏప్రిల్‌లో అధికారులు ప్రకటించారు. పర్యాటకులు సులభంగా పర్వత ప్రాంతాలకు చేరుకునేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారు.

## ప్రతిపక్షం అంటే ఏమిటి ..?
## లోకేశ్ ఆసక్తికర ట్వీట్ వైరల్

విజయవాడ, డిసెంబర్ 25 (భారత శక్తి) : ప్రతిపక్షం ప్రజాపక్షం వహించకుండా అభివృద్ధిని అడ్డుకునే ప్రతినాయకుడి పాత్ర పోషిస్తోందని ఏపీ మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. పీపీపీ విధానంలో వైద్య విద్యపై వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని ఖండిస్తూ లోకేశ్ ఓ వీడియోను తన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. పీపీపీ విధానంలో పేద వైద్య విద్యార్థులకు మెడికల్ సీట్లు, సూపర్ స్పెషాలిటీ వైద్య విద్య, పేదలకు కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని లోకేశ్ అన్నారు. ప్రజలకు మేలు చేసే పీపీపీ విధానంపై జగన్ ఉద్దేశపూర్వకంగా విషం చిమ్ముతున్నారని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వ విధానంతో మెడికల్ కళాశాలలను పూర్తి చేయాలంటే 20 నుంచి 25 సంవత్సరాలు పడుతుందని, అదే పీపీపీ విధానంలో అయితే రెండు మూడు సంవత్సరాల్లోనే మెడికల్ కళాశాలలు అందుబాటులోకి వస్తాయని, పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు అందుబాటులోకి రావడంతో పాటు పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుతాయని ఆయన వివరించారు. ప్రతిపక్షం అంటే ఏమిటి? ప్రతిపక్షం ఎలా ఉండాలి? ఎలా వ్యవహరించాలి? అనే దానిపై విమర్శనాత్మకంగా లోకేశ్ పోస్ట్ చేసిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. విద్రోహ శక్తులు ఎన్ని కుట్రలు చేసినా నవ్యాంధ్ర స్వర్ణాంధ్ర వైపు నడవడం ఆగదని ఆయన పేర్కొన్నారు.

## అప్పటి వరకు రైతు భరోసా నిధుల పంపిణీ ఉండదు

**: తుమ్మల నాగేశ్వరరావు**



హైదరాబాద్, డిసెంబర్ 25 (భారత శక్తి) : రాష్ట్రంలో యాసంగి సీజన్‌లో సాగవుతున్న పంట భూములను ఉపగ్రహ చిత్రాల ద్వారా ఖచ్చితంగా గుర్తించి, దాని ఆధారంగా రైతు భరోసా పథకం అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఉపగ్రహ చిత్రాల క్రోడీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాతే రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ... యాసంగిలో వాస్తవంగా సాగు చేస్తున్న భూములనే గుర్తించి రైతులకు న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అందుకే ఉపగ్రహ చిత్రాల ఆధారంగా భూముల గుర్తింపు పూర్తయ్యే వరకు రైతు భరోసా నిధుల పంపిణీ ఉండదని తెలిపారు. జనవరి నెలలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని తిరిగి ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ యాంత్రీకరణ పథకానికి రాష్ట్ర వాటా నిధులు సమకూర్చి, రైతులకు రాయితీపై యంత్రాలు, పరికరాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు జనవరి మొదటి వారంలో మండలాల వారీగా పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేయాలని మంత్రి సూచించారు. రైతులకు అందుతున్న రాయితీలు, యాంత్రీకరణ పథక దరఖాస్తులు, యూరియా యాప్ అమలు వంటి అంశాలపై ప్రత్యక్షంగా అభిప్రాయాలు సేకరించాలని చెప్పారు. ప్రస్తుతం ఐదు జిల్లాల్లో యూరియా యాప్ విజయవంతంగా అమలవుతోందని మంత్రి తెలిపారు. త్వరలోనే ఈ యాప్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామన్నారు. అయితే, ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాల కారణంగా యాప్ అమలులో లేని జిల్లాల్లో కొంతమంది రైతులు అవసరానికి మించి యూరియా కొనుగోలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా యాప్ ద్వారా అవసరమైన మేరకే ఎరువులు కొనుగోలు చేయాలని, రైతులెవరూ అనవసర భయాందోళనలకు గురికావద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసమే ప్రతి నిర్ణయం తీసుకుంటోందని, ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు.

# క్రిస్టమస్ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, డిసెంబర్ 25 (భారత శక్తి) : మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వినాయక నగర్ నందు వున్న బాపిస్టు చర్చి నందు క్రిస్మస్ పండుగ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి క్రిస్మస్ వేడుకలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని,ఆ యేసు క్రీస్తు కృప ప్రజలందరిపై ఉండాలని,ప్రజలు ఎల్లపుడూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని తెలిపారు.అనంతరం పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే పలువురు మహిళలకు జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ తరుపున క్రిస్మస్ కానుకలు అందజేశారు.ఈ కార్యక్రమంలోన్ కొప్పుల విఠల్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, మల్లీశ్వరి రెడ్డి,కోసనం ధనలక్ష్మి వెంకట్ రెడ్డి, జగదీష్ యాదవ్, టంగుటూరి నాగరాజు,జక్కిడి రఘువీర్ రెడ్డి,విజయ్ భాస్కర్ రెడ్డి, గుత్తా. లక్ష్మారెడ్డి, కె.కె. ఎల్. గౌడ్, అనిల్,రుద్ర యాదగిరి,చర్చి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, దైవ సేవకులు,ఇతర ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.







## భారత రత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయిజీ విగ్రహా ఆవిష్కరణ

ఎల్బీనగర్, డిసెంబర్ 25 (భారత శక్తి): దేశానికి అటల్ జీ అందించిన అపూర్వ సేవలు, ఆయన దూరదృష్టిగల నాయకత్వం, సుస్థిర పరిపాలన, ప్రజాస్వామ్య విలువల పట్ల ఆయన నెలకొల్పిన చిరస్థాయి వారసత్వం తరతరాలుగా అందరికీ ప్రేరణగా నిలుస్తున్నాయి.ఎల్బీనగర్ కూడలిలో స్థాపించిన మాజీ ప్రధాని అటల్ బీహారీ వాజపేయ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్,వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఇతర సీనియర్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

## కొల్లూరులో జంట హత్యలు..
# రక్తపు మడుగులో తల్లి, కుమారుడు

కొల్లూరు, డిసెంబర్ 25 (భారత శక్తి) : సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ జేపీ కాలనీలో తల్లి, కుమారుడు హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో మరో వ్యక్తి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరాడు. పోలీసుల కథనం ప్రకారం... నారాయణపేట జిల్లా కర్ని గ్రామానికి చెందిన శివ, వనపర్తి జిల్లా అమరచింతకు చెందిన చంద్రకళ.. ఆమె కుమారుడు రేవంత్ నాలుగు రోజుల క్రితం తెల్లాపూర్ జేపీ కాలనీకి వచ్చి నివాసం ఉంటున్నారు. శివ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం ఇంట్లో అలికిడి లేకపోవడంతో.. చుట్టుపక్కల వారు చూసేసరికి చంద్రకళ, రేవంత్ రక్తపు మడుగులో పడి ఉన్నారు. శివ తీవ్ర గాయాలతో ఉండగా.. పోలీసులు అతన్ని ఓ




ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కొల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గణేశ్ పటేల్ తెలిపారు.

# ప్రేమ శాపమైంది.. పరువు ప్రాణం తీసింది

సైదాపూర్, డిసెంబర్ 25 (భారత శక్తి) : కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలో పరువు హత్య కలకలం సృష్టించింది. కేసు వివరాలను హుజూరాబాద్ ఏసీపీ మాధవి మీడియా సమావేశంలో వెల్లడించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇటీవల చనిపోయింది. కడుపునొప్పి తాళలేక బాలిక ఆత్మహత్య చేసుకుందని ఆమె తల్లిదండ్రులు ఈనెల 14న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఇది పరువు హత్యగా తేల్చారు. బాలిక అదే గ్రామానికి చెందిన ఓ యువకుడిని ప్రేమించడాన్ని ఆమె తల్లిదండ్రులు తట్టుకోలేకపోయారు. బలవంతంగా పురుగుల మందు తాగించి, గొంతునులిమి హతమార్చారు. బాలిక తల్లిదండ్రులను అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.



## క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన
# మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మీర్ పేట్, డిసెంబర్ 25 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్రంలోని క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలను మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి తెలియజేశారు. క్రిస్మస్ పర్వదినం ప్రేమ, కరుణ, శాంతి సందేశాలను అందరికీ అందించాలని, ఈ పండుగ సందర్భంగా ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆమె ఆకాంక్షించారు.



## ఫోన్ ట్యాపింగ్ కేసు..
# ప్రభాకర్‌రావు కుమారుడి ఆర్థిక లావాదేవీలపై సిట్ ఆరా

హైదరాబాద్, డిసెంబర్ 25 (భారత శక్తి) : ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ కొనసాగుతోంది. రాధాకిషన్‌రావు, తిరుపతన్న, శ్రవణ్‌రావును సిట్ అధికారులు విచారిస్తున్నారు. రెండ్రోజుల క్రితమే ప్రణీత్‌రావు, ప్రభాకర్‌రావును కలిపి విచారించిన అధికారులు.. ప్రభాకర్‌రావు కుమారుడు నిశాంత్‌రావు ఆర్థిక లావాదేవీలపై కూడా ప్రశ్నించారు. ఇవాళ్టితో ప్రభాకర్‌రావు కస్టోడియల్



విచారణ ముగియనుండటంతో ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో దక్కన్ కిచెన్ యజమాని నందకుమార్‌ను కూడా సిట్ విచారించింది. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో నందకుమార్ గతంలో అరెస్టయ్యారు. ఫోన్‌ట్యాపింగ్ కారణంగా ఎమ్మెల్యేల కొనుగోలు అంశం తెరపైకి వచ్చింది. దీంతో నందకుమార్ వాంగ్మూలాన్ని సిట్ రికార్డు చేసింది.



## తిరుమలలో భక్తుల రద్దీ..
# తితిదే కీలక నిర్ణయం

తిరుమల, డిసెంబర్ 25 (భారత శక్తి) : వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగింది. దీంతో ఎక్కువ మంది సామాన్య భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించేందుకు తితిదే కీలక నిర్ణయం తీసుకుంది. రద్దీ కారణంగా డిసెంబర్ 27, 28, 29 (శని, ఆది, సోమవారం) తేదీలకు సంబంధించి శ్రీవాణి ఆఫ్ లైన్ టికెట్ల జారీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. గురువారం శ్రీవారి సర్వదర్శనానికి 30 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లు, నారాయణగిరి షెడ్లు భక్తులతో నిండిపోయాయి. శిలాతోరణం వరకు భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు.

# నల్గొండ భాజపాలో విభేదాలు.. ఇరువర్గాల పరస్పర దాడి

నల్గొండ , డిసెంబర్ 25 (భారత శక్తి) : నల్గొండ భాజపాలోని రెండు వర్గాల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. పార్టీ తరఫున గెలిచిన 17 మంది సర్పంచ్‌లకు సన్మానం విషయంలో తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో భాజపా నేత పిల్లి రామరాజుపై ఓ వర్గం దాడి చేసింది. దీంతో జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డిపై మరో వర్గం దాడికి పాల్పడింది. భాజపా నేతలు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణంతో ఆ పార్టీ కార్యాలయం వద్ద భారీగా పోలీసులు మోహరించారు. మరోవైపు ఈ కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులు, ఫొటోగ్రాఫర్ల కెమెరాలను కొందరు నేతలు లాక్కుని డేటాను డిలీట్ చేశారు. దీనిపై జర్నలిస్టులు భాజపా కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు క్షమాపణ చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

# ప్రైవేట్ స్కూల్ బస్సు బోల్తా.. పలువురికి గాయాలు

మహబూబ్‌నగర్, డిసెంబర్ 25 (భారత శక్తి) : మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్‌బెంగళూరు జాతీయ రహదారిపై ఓ ప్రైవేటు పాఠశాల బస్సు బోల్తా పడింది. నారాయణపేట జిల్లా మరికల్‌కు చెందిన ప్రైవేటు స్కూల్ బస్సులో విద్యార్థులు వెళ్తుండగా వెనుక నుంచి ఓ వాహనం ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పలువురు విద్యార్థులు గాయపడినట్లు సమాచారం. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.



Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.